అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 04 మార్చి 2023

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పని చేయకుండా మద్యం సేవిస్తూ జీవితంపై విరక్తి చెంది ఎలుకలమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలేపల్లి క్యాంప్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మద్దిపూడి శ్రీనివాస్ (30) గత కొన్ని రోజులుగా తాగుడికి బానిస గా మారి ఏమి పని చేయకుండా ఉంటున్నాడు. మద్యం సేవించడానికి డబ్బులు లేక తన జీవితంపై విరక్తి చెంది తేదీ గురువారం నాడు మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో ఎలకల మందు తాగి వాంతులు చేసుకోగా అతని భార్య స్నేహ చూసి అతన్ని అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య స్నేహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు రూరల్ ఎస్‌ఐ లింబాద్రి తెలిపారు.

రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-బోధన్

త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్ లో నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులను దోచుకుందని ఆరోపించారు. కేజీ టు పీజీ విద్యను రాష్ట్రంలో అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పారని అన్నారు. రాష్ట్రంలో పోడు భూములకు పట్టలిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి పత్తా లేకుండా పోయారని అన్నారు. ఇప్పటివరకు నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని అన్నారు. మోదీ కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతూ ప్రజలకు ధరలు పెంచి ఇబ్బందులు పాలు చేస్తున్నారన్నారు. బిజెపి పార్టీ 5000 కోట్ల ఆస్తులను కూడబెట్టుకున్నదని ఆరోపించారు. అనంతరం నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గాలి అనిల్ కుమార్ ను వేదికపై ఘనంగా సన్మానించారు.

డిమాండ్‌ల పరిష్కారానికి
పోరాటమే ఆయుధం



నిజామాబాద్‌లో ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

- అంగన్‌వాడీల 20 డిమాండ్‌లు నెరవేర్చాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఇరు జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా
- అంతకుముందు పెద్దఎత్తున ర్యాలీగా తరలివెళ్లిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డిటౌన్

సమస్యల పరిష్కారం కోసం పోరాటమే ఆయుధమని సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద మూడవ రోజు శుక్రవారం అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నిరసన చేపట్టి నినాదాలతో హోరెత్తించారు. తమ 20 డిమాండ్‌లు పరిష్కరించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ బైటాయించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు పాదయాత్రగా ధర్నా చౌక్, సీపీ, రైల్వే కమాన్, జెడ్పి ఆఫీస్, సుభాష్ నగర్, సంజీవయ్య కాలనీ, దుబ్బ మీదుగా కొత్త కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ ఏవోకు, ఐసిడిఎస్ పీడీకి వినతి పత్రం అందజేశారు. ఈ


కామారెడ్డిలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ


నిజామాబాద్‌లో పాత కలెక్టరేట్ ఎదుట బైటాయించిన అంగన్‌వాడీలు

సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్జహన్, శంకర్‌గౌడ్ మాట్లాడారు. కార్మిక వర్గం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ కార్మికులకు రావాల్సిన సౌకర్యా లను కుదిస్తున్నారని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించు కున్న హక్కులను నేటి బిజెపి ప్రభుత్వం హరిస్తున్నదని, అంతేకాక కనీస వేతనాలను అమలు జరపకుండా కార్మికుల బతుకులు దుర్భరం చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు జరపకపోగా కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు కూడా ఇవ్వటం లేదని, ఏడు సంవత్సరాల నుండి టీఏడీఏలు ఇవ్వకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించటం సరైనది కాదని అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోరాటం ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, దేవగంగు ,స్వర్ణ, నాయకులు చంద్రకళ, మంగ, శివ రాజమ్మ, రాజు సులోచన, గోదావరి, జ్యోతి, వాణి, లలిత, లక్ష్మి యమునా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వై గంగాధర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, తదితరులతోపాటు పెద్ద ఎత్తున అంగన్‌వాడీ టీచర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ఆందోళనలకు కాంగ్రెస్ మద్దతు

కామారెడ్డిటౌన్ : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కామారెడ్డిలో అంగన్‌వాడీలు కదం తొక్కారు. శుక్రవారం కలెక్టరేట్ వరకు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కాగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చింది. కలెక్టరేట్ వద్ద ధర్నాకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు నెలల్లో అంగన్‌వాడీ టీచర్‌ల సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం ద్వారా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల ఉపాధికి నష్టం కలిగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఈ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యూటీ చెల్లించడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆసరా పింఛను, కల్యాణ లక్ష్మి పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. గ్రాట్యుటీ చెల్లించాలని, టీఏ, డీఏలు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారని 40 సంవత్సరాలుగా ఐసిడిఎస్ లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని అయినా వీరికి కనీస వేతనం పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత లేదని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి అంగన్వాడి వర్కర్ల పేరును టీచర్స్‌గా మార్చారు కానీ టీచర్లతో సమానంగా జీతాలు ఇవ్వడం లేదు సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రగతిభవన్‌లో పిలిపించి అన్నం తినిపించి మాయమాటలు చెప్పి పంపించేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించలేని ఎడల ప్రగతి భవన్ ముట్టడించడానికి కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందని అన్నారు. వీరి డిమాండ్లన్నీ ఆమోదయోగ్యమైనవి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు నెలల్లో వీరి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు, కాసుల బాలరాజ్, జెడ్‌పిఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, ఆనంద్‌రావు, పాత శివ కృష్ణమూర్తి, ఐరేణి సందీప్, గొనే శ్రీనివాస్, బ్రహ్మానంద రెడ్డి. సీఐటీయూ చంద్రశేఖర్, సురేష్, రవీందర్, జాకీర్, కల్పన, యాదమ్మ బాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో మడిగెకు రూ.18,900 కిరాయి

- జడ్పీ దుకాణ సముదాయాలకు టెండర్‌లు పూర్తి


జడ్పీ దుకాణ సముదాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని జెడ్పీ కార్యాలయం ఆవరణలో నిర్మించిన 15 మడిగెలను జిల్లా ప్రజా పరిషత్ వారి ఆధ్వర్యంలో టెండర్ పద్ధతిలో కేటాయించారు. గత నెల 25న టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ టెండర్‌కు 83 అప్లికేషన్ ఫారమ్‌లను తీసుకెళ్లగా.. 56 మంది టెండర్ ప్రక్రియలో పాల్గొన్నట్టు తెలిపారు. రూ.10 వేలు నాన్ రిఫండబుల్ అడ్వాన్స్ చెల్లించి టెండర్ ప్రక్రియలో పాల్గొన్నట్టు అధికారులు తెలిపారు. కాగా గరిష్టంగా 15 మంది 18,900 చొప్పున టెండర్ వేయడంతో వారికి కేటాయించినట్టు తెలిపారు. టెండర్ ప్రక్రియ ద్వారా సముదాయాలు పొందిన వారి నుంచి రెండు లక్షల రూపాయల చొప్పున అడ్వాన్స్‌గా స్వీకరించి మూడు సంవత్సరాల వరకు అగ్రిమెంట్ కుదిర్చినట్టు తెలిపారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీని సందర్శించిన రీజినల్ కో ఆర్డినేటర్

నవతెలంగాణ-కోటగిరి


మాట్లాడుతున్న అబ్దుల్ బషీర్

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పరీక్షలంటే ఒత్తిడికి గురికాకుండా చూడాలని ఉమ్మడి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ బషీర్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. హాస్టల్లో సదుపాయాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని, పలు రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ మోబిన్‌ను ప్రకారం ముందుకు సాగాలని పరీక్షలలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు, సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిని పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.

క్లిష్టపరిస్థితుల్లో పని చేస్తున్నాం..

- పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్ ప్రకటించాలని విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

క్లిష్ట సమయంలోనూ రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నామని, ఎంతో మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా పని చేస్తున్నామని విద్యుత్ ఉద్యోగులు అన్నారు. తమకు పీఆర్‌సీ ప్రకటించి ఈపీఎఫ్, జీపీఎఫ్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్‌లోని విద్యుత్ ప్రగతి భవన్ ఎదుట జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ కన్వీనర్ రేంజర్ల బాలేశ్ కుమార్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం రాష్ట్ర జేఏసీ నాయకులను, రాష్ట్ర విద్యుత్ శాఖ చైర్మన్ ఎండీ 6 న జేఏసీ తో పిఆర్సి పై చర్చించడానికి, యజమాన్యం నుంచి పిలుపు వచ్చిందని అయినా 6వ తేదీ వరకు తమ నిరసన కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలియజేయాలని సూచించారు. 6న యజమాన్యం నిర్వహించే చర్చలలో పిఆర్సి, ఈపీఎఫ్ నుంచి జిపిఎఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేందర్ 1104 అధ్యక్షులు, కో చైర్మన్ గంగాధర్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, ఏ.కాశీనాథ్, బి.సురేష్ కుమార్, గంగారాం నాయక్, రామ్ సింగ్, వేణుగోపాల్, నిజాముద్దీన్, ఉమా రాణి, ఆర్మూర్ డివిజన్ జేఏసీ చైర్మన్ నరేంద్రనాయక్, బోధన్ డివిజన్ జేఏసీ చైర్మన్ శివకుమార్, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ శతిష్ కుమార్, చంద్రశేఖర్, గంగాధర్, రవీ, కిషోర్, ఉమారాణి, దాదాపు 500 మంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఉన్న విద్యుత్తు కార్మికులు, ఉద్యోగులు, ఇంజనీర్స్ అందరూ ఆర్మూర్, బోధన్, నిజామాబాద్, డిచ్‌పల్లి నుంచి పవర్ హౌస్ కు ఎస్ఈ ఆఫీస్ దగ్గరికి రావాల్సిందిగా కోరారు. జిల్లావ్యాప్తంగా ఒకే చోట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం ఉంటుందని అన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్, పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి



ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఒక నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి లేదని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. పరీక్ష జరిగే సమయంలో జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. జిల్లాలో 38 ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు 7495 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 6253 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ఏప్రిల్ 13 వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలో 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 11,899 మంది విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఐదుగురిని రూట్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. 22 మంది కస్టోడియన్స్, 15 మందిని సి సెంటర్ కస్టోడియన్స్‌గా నియమించినట్లు చెప్పారు. 595 మంది ఇన్విజిలేటర్లను నియమించామని పేర్కొన్నారు. రెవెన్యూ, ఆర్టీసీ, వైద్య, పోస్టల్, పోలీస్ శాఖలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల విభాగం అధికారులు లింగం, అజ్మల్ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

మైనంపల్లి గెస్ట్‌హౌస్‌లో ఇద్దరు అడ్డా కూలీలు మృతి

- గోడ మీద నుంచి జారిపడి ఒకరు.. అది చూసి గుండెపోటుతో మరొకరు మృతి

నవతెలంగాణ-నవీపేట్


మృతిచెందిన రాజు



నిజామాబాద్ జిల్లా జన్నేపల్లిలో గల మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గెస్ట్ హౌస్‌లో ఇద్దరు అడ్డాకులీలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కొండపల్లి రాజు (38) గత ఐదు సంవత్సరాలుగా నిజామాబాదులో అడ్డా కూలీగా పనిచేస్తున్నాడు.

వివరాలు మెయిన్‌లో..

క్రీడా నైపుణ్యంతో ఉన్నత స్థాయికి ఎదగాలి



పతకాలు చూపుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

క్రీడ నైపుణ్యాన్ని అలవర్చుకొని ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి ఎదగాలని, నిజామాబాద్ ఆర్డీవో రవి అన్నారు. శుక్రవారం మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, స్పోర్ట్స్ మీట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుంటే జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సునాయాసంగా ఎదుర్కొని సమాజ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. మాలవత్ పూర్ణ, నికత్ జరీనా, ఎండల సౌందర్య, లాంటి వాళ్లను ఆదర్శంగా తీసుకొని క్రీడలలో నైపుణ్యాలను మెరుగుపరచుకొని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించుట కు కృషి చేయాలి అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయన్నారు. విద్య అనేది వినమ్రతను పెంచుతుందని, అంతిమంగా క్రమశిక్షణ వ్యక్తిత్వం నడవడిక పరిణతి చెందినప్పుడే మనం ఉత్తమ విద్యార్థులు, తద్వారా ఉత్తమ పౌరులు అవుతామన్నారు. సత్యశోధక్ స్పోర్ట్స్ మీట్ విజేతలకు బంగారు, వెండి, రజత పతకాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యం అందర్నీ అలరింపజేసింది. కార్యక్రమంలో తాసిల్దార్ గఫ్ఫార్ మీయా, మండల విద్యాధికారి బెజ్జోరా శ్రీనివాస్ ,సత్య శోధక్ పాఠశాల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్ నరసయ్య ,రెడ్ క్రాస్ డివిజనల్ సెక్రెటరీ సాల్మన్ ,ఆర్ ఐ గంగరాజు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏకు నివాళి

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ స్వామి (42) తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మార్వో ప్రేమ్ కుమార్, తాహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, మండల వీఆర్‌ఏలు స్వామి మృతదేహానికి నివాళులు అర్పించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని కొరారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రుణాలతో ఆదాయాభివృద్ధి

నవతెలంగాణ-భీంగల్



మహిళా సంఘల సభ్యులు ఐకెపి ద్వారా తీసుకున్న రుణాలతో చిరు వ్యాపారాలను చేపట్టి ఆర్థిక పురగతిని సాధించాలని డీఆర్‌డివో పీడి చందర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీలలో వందశాతం సాధించడంలో కృషి చేసిన ఐపియం కుంట శ్రీనివాస్, సీసీలను అబినందించారు. పీడీ మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధికి చిరు వ్యాపారాలు చేపట్టి ఆదాయాభివృద్ధి సాధించాలన్నారు. సమావేశలో డీఆర్‌డి మధుసుధన్, ఎంపీడీఓ రాజేశ్వర్, డీపియం నీలిమ, ఎంపివో గంగమోహన్, వేల్పూర్ ఏపిఎం కిరణ్, సీసీలు నరేష్, సాయిలు, భాస్కర్, సుమలత, గంగలత, సిబ్బంది ముత్యం, గణేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి

నవతెలంగాణ-సిరికొండ


అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారి శర్వానంద్

అటవి సంపద మనందరిదని, అడవులను సంరక్షించుకుంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, అదేవిధంగా వన్యప్రాణులను కూడా సంరక్షించాలని, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానంద్ అన్నారు. శుక్రవారం సిరికొండ రేంజ్, కమ్మర్‌పల్లి, భీమ్ నగర్, జినిగ్యాల, పందిమడుగు బీట్లను కాలినడకన, అటవీ మార్గం గుండా పరిశీలించారు. ఎండలు సమీపిస్తున్నందున వన్యప్రాణులు నీటి కోసం గ్రామాల్లో సంచరిస్తాయని, వాటి సంరక్షణ కోసం అటవీ ప్రాంతాలలో సోలార్ బోరు మోటర్ కమ్మర్‌పల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేశామని తెలిపారు. జినిగాల అటవీ ప్రాంతంలో చెరువులో నీరు అధికంగా ఉన్నాయని, సిరికొండ అటవీ ప్రాంతంలో రెండు చెక్ డ్యాములు ఏర్పాటు చేశామని తెలిపారు. అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, అక్రమంగా చెట్లను నరికి భూమిని చదును చేసిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈయన వెంట డీఎఫ్ఓ వికాస్ మీనా, ఎఫ్‌డీఓ భవాని శంకర్,సిరికొండ రేంజ్ అధికారి ఎమ్ వి నాయక్, భీంగల్ రేంజ్ అధికారి రవీందర్, డిఆర్‌ఓలు గంగారాం, దేవిదాస్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్ధక అధికారి

నవతెలంగాణ-సిరికొండ

నేషనల్ లైస్ టాక్ మిషన్ ద్వారా ప్రభుత్వం అందించే 50 శాతం సబ్సిడీ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్య అధికారి కాందారే బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎల్ఎం ద్వారా ఆవులు, గేదెలు, గొర్లు, మేకలు, పందులు, లాంటివి బ్యాంకు లింకేజీ, వితౌట్ లింకేజీ ద్వారా లోన్లు పొందే అవకాశం ఉందని అన్నారు. మినిమం ఒక్క యూనిట్ 105 గొర్రెలు కానీ, మేకలు కానీ 20 లక్షలతో తీసుకున్నట్లయితే 50 శాతం అంటే 10 లక్షల రుణమాఫీ ఉంటుందని తెలిపారు. సబ్సిడీ రుణానికి ఆన్లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. సబ్సిడీ రుణాలు, సమాచారం కోసం మండల పశు వైద్య అధికారిని గానీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని మైలారం గ్రామంలో శుక్రవారం ఎంపిపి, సర్పంచ్, ఎంపీటీసీ, వీడీసీ సభ్యుల ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ రమ్యసత్యానంద్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి, రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చెర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జడ్పీటీసీ, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు జగన్‌కు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపి సంగీతారాజేందర్,సర్పంచ్ గాండ్ల రమ్యసత్యానంద్, ఎంపిటిసి గాండ్ల సతీష్ పటేల్,విడిసి సభ్యులు బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దలకు సబ్సిడీలు..

పేదలపై భారాలా..



నందిపేట్‌లో..

- గ్యాస్ ధర పెంపుపై నిరసనలు
- వంటావార్పు, కట్టెలపొయ్యిపై వంట
- దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-విలేకరులు

నందిపేట్: మండలకేంద్రంలో మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో సిలిండర్ ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. 450 రూపాయలు ఉన్న సిలిండర్ ధరను కేంద్ర బీజేపీ ప్రభుత్వం 1200 రూపాయలకు చేర్చిందన్నారు. నిరుపేద ప్రజల సొమ్మును సిలిండర్, పేదలు వాడే అన్ని వస్తువులపై జీఎస్టి వేసిందన్నారు. ఈ సంపదనంతా ఆదాని అంబానీలకు అప్పచెప్పి 10 లక్షల కోట్ల ప్రజా సంపదను ఆవిరి చేసిందన్నారు. 500 రూపాయలకే సిలిండర్లను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, హాయ్మధు ఖాన్, ఎంపీటీసీలు బజరంగ్, ఉస్సుద్దిన్, కావేరి గంగాధర్, బుకసాగర్, మైనార్టీ విభాగం అధ్యక్షులు పాషా, సొసైటీ వైస్ చైర్మన్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: గ్యాస్ సిలెండర్ ధర పెంపునకు నిరసిస్తూ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్ వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్లకు లక్షల కోట్లు సబ్సిడీల రూపంలో అప్పనంగా అందజేస్తున్న కేంద్రం ప్రభుత్వం సామాన్యులకు వేల కోట్ల భారాలు వేస్తుందని విమర్శించారు. ఈ మహా ధర్నా మండల అధ్యక్షులు చిలివెరి గంగాధస్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ, రేపు సమితి అధ్యక్షులు మహానాయక్ ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్ మహిళా అధ్యక్షురాలు పులి వసంత సీనియర్ కార్యకర్తలు పాశం కుమార్, అరటి రఘు, కచ్చకాయ ల శ్రీనివాస్, వెంకటేష్, తాటిపాముల శ్రీనివాస్, గుప్తా, ఉపాధ్యక్షుడు బీరేష్, క్రాంతి కుమార్, ప్రవీణ్ గౌడ్, శేఖర్, ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్, బాబురావు, సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపాల్: మోపాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వంట గ్యాస్ పై ధర పెంపునగకు నిరసనగా వంటావార్పు చేపట్టారు. ఈసందర్భ:గా మంచిప్ప సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ సామాన్యుడికి నడ్డి విరుస్తుందని అన్నారు. మోడీ తన వస్త్రధారణకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నాడని, ఇది సామాన్య ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాయితీ సిలిండర్ల ధర తగ్గించాలని అన్నారు. కన్నీరాం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం జిఎస్టి బకాయిలను విడుదల చేయడంలేదని తెలిపారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్, సిర్పూర్ సర్పంచ్ ముత్యం రెడ్డి, సీనియర్ నాయకులు నరేష్, మోపాల్ సొసైటీ చైర్మన్ మోపతి, సర్పంచ్ లత భూషణ్, పార్టీ సీనియర్ నాయకులు సతీష్ రెడ్డి, నవనీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో..

ధర్పల్లి: దేశ ప్రజల పొట్టకొట్టి ప్రధాని మోడీ ఆదానీలను ఆదుకుంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అన్నారు. గ్యాస్ ధర పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండలకేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. మోడీ చెప్పుతున్నట్లు ప్రజలకు అచ్చే దిన్ కాదు పెరిగే ధరలు భరించలేక పేద ప్రజలు సచ్చే దిన్ వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్ రెడ్డి, సొసైటీ చైర్మెన్లు చెలిమెల మల్లికార్జున్, ధర్మయ్యగారి రాజేందర్ రెడ్డి, మ్యాడారం రాజేందర్ రెడ్డి, సర్పంచులు ఆర్మూర్ పెద్ద బాలరాజ్, కొండా శేఖర్, భగవంత్ రెడ్డి, వాడి గంగారెడ్డి, నరేందర్, కుర్రోళ్ళ రమేష్, మురళి, సంగీత భాస్కర్, లొక్కిడి విజయ రాములు, లింబియా నాయక్, శర్మన్ నాయక్, రాజేష్ నాయక్, ఉప సర్పంచులు, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి ఇప్పటివరకు ఏడుసార్లు సిలిండర్ల ధరను పెంచారని, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి రూపాయి నిధులు ఇవ్వకుండా ప్రజల నడ్డి విరిచే ప్రయత్నాలు చేస్తున్నారని మండల అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మలావత్ సంగీత రాజేందర్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, సర్పంచులు, ఎంపీటీసీలు గాండ్ల సతీష్ పటేల్, గోవర్ధన్, గ్రామ శాఖ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, నర్సారెడ్డి నాయకులు మహమ్మద్ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: గ్యాస్ సిలెండర్ ధర పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వంట గ్యాస్ ధర తగ్గించాలని కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీపీ కుంచాల విమల రాజు అధ్యక్షతన కట్టెల పొయ్యిపై మహిళలు వంట చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, మండల పార్టీ అధ్యక్షులు నట్ట భోజన్న, ఎంపిటిసిలు, మండలంలోని పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మైనార్టీ కోఆప్షన్ మెంబర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సిరికొండలో..



డిచ్‌పల్లిలో..



జక్రాన్‌పల్లిలో..



మోపాల్‌లో..

గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

నవతెలంగాణ-మాక్లూర్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల ప్రధాన కార్యదర్శి దుడ్డుగంగాధర్ అన్నారు. మండలంలోని మాణిక్ బండార్ చెక్క వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సిలిండర్ గ్యాస్ ధర నిత్య అవసరాల ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచి పేద ప్రజలపై భారాలు మోపడం సరికాదని అన్నారు. ధరలు తగ్గించకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో మండల నాయకులు వినయ్, ఈశ్వర్, రవి ఇతరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమి పూజ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని 9వ డివిజన్ ఓల్డ్ నగరంలో రూ.20లక్షల పట్టణ ప్రగతి నిధులతో బీటీ రోడ్డు పనులకు కార్పొరేటర్ సాయి వర్ధన్‌తో కలిసి నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త నగర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ నగర అభివృద్ధికి కట్టుబడ్డ ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపి డివిజన్లలో అంతర్గత రోడ్లు, మురికి కాలువల నిర్మాణనికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తున్నామని మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ తెలియజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన కాశ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. ఇదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పైడి రాకేష్ రెడ్డి శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తక్షణ ఆర్థిక సహాయం గా 20వేల రూపాయలు అందజేశారు. వారి కుటుంబానికి పిల్లల చదువులకు అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొబ్బిలి ఇందిరా నర్సయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్ర మున్నూరుకాపు మహిళా సంఘం అధ్యక్షురాలు ఆకుల లలిత నిజామాబాద్ జిల్లా కమిటీ ని, జిల్లా మహిళా మున్నూరు కాపు సంఘ కార్యవర్గాన్ని శుక్రవారం నిజామాబాద్‌లో వెల్లడించారు. ఇ జిల్లా కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొబ్బిలి ఇందిరా నర్సయ్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఇందిరా మాట్లాడుతూ ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల లలిత, జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రాజు, అర్బన్ అధ్యక్షులు బంటు నిర్మల బలరాంకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా, అర్బన్ అధ్యక్షులు ఇరువురు మాట్లాడుతూ మున్నూరు కాపు మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుండాలని, పార్టీలకు అతీతంగా మున్నూరు కాపు వారందరూ అభివృద్ధి చెందాలని కోరారు. మున్నూరు కాపు వారు జిల్లాలోనే కాదు... రాష్ట్రంలో 60 శాతం ఉన్నారని, వారిని అభివృద్ధి పరిచాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కొరకు పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితను వారు అభినందించారు. మహిళ రిజర్వేషన్ బిల్లుకోసం కవితతో పాటు జిల్లా మహిళందరూ కలిసి రావాలని కోరారు.

ప్రభుత్వాలు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నాయి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న నర్సింలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నువ్వు అంటే నువ్వు అని ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని కోయేడి నర్సింలు అన్నారు. నగర ఫైవ్ మన్ కమిటీ నాయకులు కోయేడి నర్సింలు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంట గాస్ ధర పెంచడాన్ని తెలుగుదేశం పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రతి సామాన్యుడికి సమన్యాయం జరిగేలా చర్యలు చేపట్టారని, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నువ్వు అంటే నువ్వు అని ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని మండి పడ్డారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారని తెలిపారు. నిజామాబాద్ అర్బన్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫైవ్‌మన్ కమిటీ నాయకులు లవంగ రాజు, శంకర్ ముదిరాజ్, నవతే నర్సయ్య, నారా గౌడ్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో గ్యాస్‌సిలెండర్, వంటచెరుకుతో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిజామాబాద్ ఒకటవ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ చౌరస్తాలో వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ గ్యాస్ సిలిండర్‌లు, వంటచెరుకుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర ఇంచార్జ్ ఓమయ్య మాట్లాడుతూ.. పది సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం రెండు వందల రెట్ల టాక్స్‌లు పెంచారని, వచ్చిన సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రాయితీలు ఇస్తున్నారని అన్నారు. వంట గ్యాస్, వాణిజ్య గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం బీజేపీకే చెల్లిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను పట్టపగలు దోచుకుంటున్న మాకు ఏమీ సంబంధం లేదని ప్రజలు చూడవద్దని, అన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు. ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షల రూపాయల నగదు, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు వంటి హామీలు ఇచ్చి నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు ధరలు తగ్గేంతవరకు ఉద్యమించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీపీఐ 1వ డివిజన్ కార్యదర్శి జీ.రమేష్, సిపిఐ నాయకులు బి.అనిల్, సంతోష్ గౌడ్, మైపాల్, సిహెచ్ ఎల్లయ్య, సురేష్, అబ్బాస్, సిద్ధిరాములు, గంగాధర్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, సుశీల, తబస్సుమ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని యానం నుండి బ్రాహ్మణపల్లి, తొర్లికొండ గ్రామాల మీదుగా వేల్పూర్ వరకు డబల్ రోడ్ శాంక్షన్ అయిన సందర్భంగా పనులను ఎంపీపీ కుంచాల విమల రాజు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి సర్పంచ్ మాదరి లత , ఎంపీటీసీ పోతే రాజు, తొర్లికొండ గ్రామ సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ సంకేపల్లి పద్మ, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదవారికి అండగా మంత్రి ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



చెక్కు అందజేస్తున్న నాయకులు

ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చెక్కులు మంజూరు చేయిస్తూ మంత్రి ప్రశాంత్ రెడ్డి పేదవారికి అండగా ఉంటున్నారని బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తెడ్డు కిరీటి అన్నారు. శుక్రవారం మండలంలోని హాసకోత్తూర్ గ్రామానికి చెందిన పాలేపు లింగయ్యకు రూ.23 వేలు, మంచాల దివ్యకు రూ.30 వేల ఆర్థిక సహాయం చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వ సమితి అధ్యక్షులు నోముల నరేందర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ తెడ్డు రాజన్న, కట్ట చిరంజీవి, జంగం మహేష్, ఎలేటి లింగారెడ్డి, మేడపు రమేష్, భూఖ్య మోహన్, రేషమైనా రాజారం, దాస రాజేశ్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



కమిషనర్‌ను సన్మానిస్తున్న జీజీ ఫౌండేషన్‌వారు

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇటీవలే పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చవాన్‌కు స్వాగతం పలుకుతూ జీజీ ఫౌండేషన్ అధ్వర్యంలో లయన్ నివేదన్ గుజరాతి వారికి పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ సామాజిక సేవలు చేస్తున్న లయన్ నివేదన్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో దాచేపల్లి సంతోష్, గజనంద్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇచ్చి తొలగించారు

- కన్నీరు పెట్టిన బాధితులు

నవతెలంగాణ భీంగల్

. బడా భీంగల్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెమ్ రూంలను ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ జాబితానుండి తొలగించారని గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారుల ముందు కంట నీరు పెట్టుకున్నారు. గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూంల అర్హుల జాబితాను తహసీల్దార్ చదివి వినిపించినపుడు అందులో తమ పేర్లు ఉన్నాయని, ఇప్పుడు తమను ఆకారణంగా అర్హుల జాబితా నుండి తొలగించారని వారు కంటతడిపెట్టుకుంటు తమకు కేటాయించాలని తహసీల్దార్ శ్రీధర్ కుమార్‌తో మొరపెట్టుకున్నారు. ఈ విషయమై మాట్లాడుతూ తొలి జాబితాను పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ప్రకటించామని, రెండో విడతలో గ్రామసభ ద్వారా ప్రకటించిన జాబితానే ఖరారు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఒంటరి మహిళలకు ఈ పథకం వర్తించని ప్రభుత్వ నిబంధన ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

సబ్‌జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్



హాజరైన క్రీడాకారులు

ఆర్మూర్ లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాయ్స్ స్కూల్‌లో నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ హడాక్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అడక్ కమిటీ చైర్మన్ గంగ మోహన్ చక్రు, కన్వీనర్ పింజ సురేందర్, కో కన్వీనర్ గట్టడి రాజేష్ శుక్రవారం తెలిపారు. ఎంపిక ప్రక్రియకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని స్కూల్స్ నుండి వందమంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. ప్రతిభా కనబరిచిన 20 మంది క్రీడాకారులను నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ జట్టు హ్యాండ్ బాల్ శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్, ప్రవీణ్, రాజేందర్, మహేష్ నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్-ఉప్పలవాయి స్కూల్‌లో ఈనెల 5 నుండి 10వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ అండ్ బాయ్స్ జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ జట్టు ఈనెల 10, 11, 12 తేదీల్లో ఆర్మూర్ లోని మామిడిపల్లి ఆల్ ఫోర్స్ నరేంద్ర హైస్కూల్ నందు జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్య అతిథులుగా నిజామాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టి. విద్యాసాగర్ రెడ్డి టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాయ్స్ ఆర్మూర్ ప్రిన్సిపాల్ దుర్గా రెడ్డి పాల్గొన్నారని అన్నారు. వీరితోపాటు అప్పల గణేష్ సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీత, బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి శ్యామ్, బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి నగేష్, పీఈటీలు రజిత, శ్రీకాంత్, మహేష్, రాజేందర్, ప్రవీణ్, ధర్మపురి పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడుదాం

ప్రగతి శీలా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి

నవతెలంగాణ-ఆర్మూర్

మహిళల హక్కుల కోసం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో కుమార్ నారాయణ భవన్ ప్రజాపంథా కార్యాలయంలో శుక్రవారం డివిజన్ అధ్యక్షురాలు రామ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి, ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి ఎం. ముత్తన్న మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా సాంస్కృతిక సమస్యలపై చర్చించుకునేందుకు మహిళా దినోత్సవాన్ని జరుపుతారన్నారు. బీజేపీ ప్రభుత్వం కొద్దిమంది కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతుందని, అన్నారు. సైన్స్ స్థానంలో జ్యోతిష్య శాస్త్రాన్ని, మనువాద భావజాలాన్ని ప్రవేశపెడుతూ గోరక్షణ పేరుతో దాడులకు హత్యలకు పూనుకుంటుందని తెలిపారు. దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, హత్యలు ఫాసిస్ట్ చర్యల్లో భాగమేనని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ మతోన్మాదం, మనువాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు రమ, జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యక్క, డివిజన్ నాయకులు పద్మ, లక్ష్మి పుష్పలత, సునీత ఇందిరా స్వరూప, నర్సక్క, అమృత, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుండి క్రమశిక్షణతో చదువుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు చిన్ననాటి నుండి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. శుక్రవారం పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబి రాజేశ్వర్, కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షత్రియ పాఠశాలలో వైద్యశిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ పాఠశాలలో పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని క్షత్రియ విద్య సంస్థల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, ఈ ఎన్ టి నిపుణులు సిఎస్ చైతన్య, ప్రముఖ దంతవైద్య నిపుణులు అనిల్ పడాల్, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొని 120 మంది విద్యార్థులకు చికిత్సలు అందించారు . ఈ సందర్భంగా క్షత్రియ విద్య సంస్థల చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించ వచ్చని అన్నారు. కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే గుర్తించడానికి ఇటువంటి శిబిరాలు దోహదపడుతాయని అన్నారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యంగా ఉండడం కూడా అంతే ముఖ్యమని అందుకే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్లను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గ్యాస్‌పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఎల్లారెడ్డి బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు మర్లు సాయిబాబా అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్యాస్ అప్పట్లో రూ.410 వంట గ్యాస్ ధర ఇప్పుడు మోడీ పాలనలో రూ.1155కు పెరిగిందన్నారు. ప్రజలపై భారం వేస్తున్న మోడీ ఇప్పటికే వంట నూనెల ధరలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచడంతో పేద ప్రజలు బుక్కెడు అన్నం తినలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఎన్నికలు కాగానే ఇలా బండ బాదుడు షురూ చేసి సామాన్య గృహిణులు నెత్తిన పిడుగు వేసిన ఘనత మోడీ సర్కార్‌దేనని విమర్శించారు. దేశాన్ని దోచి మిత్రులకు పంచే సంస్కృతికి మోడీ సర్కార్ పాలన అద్దం పడుతుందని ఎద్దేవా చేశారు. సర్కార్ గ్యాస్ ధరలు పెంచి వంట చెరుకు కోసం అడవులు నరికేలా చేస్తుందని ఆరోపించారు.

చోరీ ఘటనలో దొంగకు ఐదేండ్ల జైలుశిక్ష

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని అంబం సాయవ్వ అనే మహిళ ఇంట్లో గత సంవత్సరం సెప్టెంబర్‌లో వర్మల్ అలియాస్ వడ్లమూల గంగాధర్ అనే వ్యక్తి మధ్యాహ్నం వేళ దొంగతనానికి పాల్పడిన సమయంలో మహిళ మెడలో నుంచి బంగారు నగలు లాక్కునే క్రమంలో మహిళ ప్రతిఘటించింది. దాంతో నిందితుడు ఆమె గొంతును కత్తితో గాయంచేసి బంగారు నగలు దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితులు బోధన్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ సందీప్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. శుక్రవారం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయ్య కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ కేసు పూర్వపరాలను పరిశీలించి నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.300 జరిమానా విధించారు. లేనియెడల 45 రోజుల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా బోధన్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రాజ్, లైసెన్ పోలీస్ ఆఫీసర్ శంకర్, చంద్రశేఖర్ కానిస్టేబుల్ ఉన్నారు.

పేదప్రజలపై పెనుభారం

గ్యాస్ ధరలపై భగ్గుమన్న బీఆర్ఎస్

- పలు మండలాల్లో నిరసనలు

నవతెలంగాణ-విలేకరులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజలపై పెనుభారం మోపుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెంపును నిరసిస్తూ మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు.

కోటగిరి : మండల కేంద్రంలో ఉమ్మడి మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గ్యాస్ బండలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఉమ్మడి మండలాల అధ్యక్షులు ఏజాస్ ఖాన్ ఆధ్వర్యంలో దహనం చేశారు. అదానీ చేసిన తప్పులను మర్చిపోవడానికి బీజేపీ గ్యాస్ ధర పెంచిందని, కేంద్ర ప్రభుత్వ పనితీరు సామాన్యుడికి పెను భారంగా మారిందని, కల్లబొల్లి మాటలతో విమర్శించే వారిపై దాడులు చూపిస్తుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వహీద్, జడ్పీటీసీ కోఆప్షన్ సిరాజుద్దీన్, విండో అధ్యక్షులు కూచి సిద్దు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు బీర్కూర్ గంగాధర్, బర్ల మధు, అనిల్ కులకర్ణి, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



పిట్లంలో..

మద్నూర్ : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచడాన్ని నిరసిస్తూ డోంగ్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శశాంక్ పాటిల్, ఉమ్మడి మద్నూర్ మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ దిగంబరరావు పాటిల్, డోంగ్లి సింగిల్ విండో చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రామ్‌పటేల్, బీఆర్ఎస్ మండల నాయకులు విలాస్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ అంబేద్కర్ చౌరస్తాలో ఖాళీ సిలిండర్లు ప్రదర్శిస్తూ శవయాత్ర, అంతిమ సంస్కారాలతో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వాసరి రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వంటగ్యాస్ ధరలు మార్చ్ ఒకటి నుంచి మరోసారి భారీగా పెంచిందన్నారు. 14.2 కేజీ డొమెస్టిక్ ఎల్పీజీ ఏకంగా రూ.50 పెంచి 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర 350 పెరిగిందన్నారు. అడ్డగోలుగా వంట గ్యాస్ ధరలు నుంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వర్ని : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరను అధికంగా పెంచి సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం మోపిందని టీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు వర్ని, మోస్రా, చందూర్, రుద్రూర్ మండల కేంద్రాలలో ఖాళీ సిలిండర్లతో పలు రకాలుగా నిరసనలు చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామని చెప్పి ఇప్పుడు సిలిండర్ 1200 వరకు పెంచడంతో సిలిండర్‌ను కొనుక్కోలేని పరిస్థితిలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది మోడీ సర్కారుకు సిగ్గుచేటని అన్నారు. ప్రజలు కట్టెల పొయ్యిపై వండుకుంటుంటే మహిళలు ఎవరూ కూడా కట్టెల పొయ్యిపైన వండకుండా సిలిండర్ ఇస్తామని గొప్పలు చెప్పిన మోడీ ఇదేనా నీ సిలిండర్ల ధరలు పెంచడం అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు బాధ వస్తే ఊరుకునేది లేదని కేంద్ర మోడీ సర్కార్‌కు ప్రజలపై పెంచిన ధరలను వెంటనే తగ్గించి మధ్యతరగతి, సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వర్నిలో..



మద్నూర్‌లో..

అధికారుల నిర్లక్ష్యం తగదు

- సర్వే పనులు చేపట్టకపోతే తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తాం
- భారతీయ కిసాన్‌సంగ్ అధ్యక్షులు చాట్ల గోపాల్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రం నుంచి మండలంలోని చిన్న ఎక్లారా గ్రామానికి వెళ్లే దండిదారి గత 40 సంవత్సరాల కాలంగా పూర్తిగా దారి లేకుండా పోయిందని, దీనికోసం సర్వే చేపట్టాలని అధికారులకు విన్నవిచ్చినా.. నిర్లక్ష్యం చేస్తున్నారని భారతీయ కిసాన్‌సంగ్ అధ్యక్షులు చాట్ల గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. వ్యవసాయదారుల విన్నపాన్ని రెవిన్యూ అధికారులు వెంటనే స్పందించి నక్ష ప్రకారం దండిదారిని కొలతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

రైతులతో పాటు విద్యుత్ అధికారులు గస్తీ నిర్వహించాలి

- డివిజనల్ విద్యుత్ డీఈఈ కామేశ్వరరావ్

నవతెలంగాణ-పిట్లం

పంట పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను కాపాడుకోవటానికి రైతులతో పాటు విద్యుత్ శాఖ అధికారులు రాత్రిపూట గస్తీ నిర్వహించాలని బాన్సువాడ డివిజనల్ విద్యుత్ శాఖ డీఈఈ కామేశ్వరరావు శుక్రవారం పేర్కొన్నారు. గత రాత్రి మండలంలోని మద్దెల చెరువు గ్రామంలో 6 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరును గుర్తు తెలియని దుండగులు ఎత్తికెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్, మద్నూర్, మెనూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాల్లో గత కొద్ది రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లు ఎత్తుకెళ్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పంట పొలాలకు రాత్రిపూట గస్తీ నిర్వహిస్తూ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులను సంచరించినచో వారిని గమనించి సమీపంలోని పోలీసులకు, అలాగే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే దొంగతనాలను అరికట్టి పంట పొలాలను కాపాడుకోవచ్చునని ఆయన సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలను అరికట్టడానికి పోలీస్ శాఖ సహకారం కోరామని, రాత్రివేళ గస్తీ నిమిత్తం రైతులతోపాటు, విద్యుత్తు శాఖ అధికారులు గస్తీ నిర్వహించాలని ఆదేశించినట్టు ఆయన తెలిపారు. ఈ విషయమును ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలని ఆయన కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సదాశివనగర్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గైని అనుసూయ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. జ్ఞానేంద్రియాలలో ముఖ్యమైనది కన్ను అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కమిలి నర్సింలు, ఉపసర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, జడ్పీ కోఆప్షన్ మొహినోద్దిన్, టీఆర్‌యస్ నాయకులు గాదారి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం

నవతెలంగాణ-బోధన్

బోధన్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి 2023-2024 సంవత్సరానికి నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించడానికి శుక్రవారం ఎన్నికల అధికారులను నియమిస్తూ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించినట్టు బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.గంగారెడ్డి తెలిపారు. ఈసీ నిర్ణయం అనుసారం న్యాయవాదులు సంగం గంగాధర్‌గౌడ్‌ను ఎన్నికల అధికారిగా, బాణోత్ రమేష్‌ను అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ మేరకు నియామకపత్రాన్ని అందచేశారు.


మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు రేపు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం మైనారిటీ కార్పోరేషన్ ద్వారా అందించే స్వయం ఉపాధి రుణాలకు 4వ తేదిన బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.డీ ఖమర్ ఆహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు 4న ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాలున్న అభ్యర్థులు, 6వ తేదీన యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతాలున్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

మహిళా సంఘాలు ఆదాయం పెంచుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ సాయన్న



మాట్లాడుతున్న పీడీ సాయన్న

నవతెలంగాణ-లింగంపేట్

మహిళా సంఘాలు అదనపు ఆదాయం పెంచుకోవడానికి ముందుకు రావాలని జిల్లా డీఆర్డీఏ పీడీ సాయన్న అన్నారు. శుక్రవారం మండలంలోని బోనాల గ్రామంలో మహిళా సంఘం ముందుకు వచ్చి డ్రం సిస్టం ద్వారా ఏర్పాటు చేసిన చేపలకు పెంపకం యూనిట్లు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల సాయిగౌడ్, డీజీఓ సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డీపీఎం రమేష్ బాబు, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఏపీవో తులసి రామ్, సీసీలు స్వప్న, గంగరాజు, శ్రావణ్, సీఏ అశోక్, గ్రామ మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని పోచారం నీరు చివరి ఆయకట్టు వరకూ అందాలని ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ మాధవి పోచారం నుంచి వచ్చే నీళ్ల కాలువను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుద్రారం ఆయకట్టుకు నీళ్లు వదిలి సుమారు 14 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు చివరి ఆయకట్టు వరకు నీళు అందక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట్ చౌదరి చెరువులో మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలను జిల్లా మత్స్యశాఖ అధికారి వరదరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మనాగరాజు, త్రిసభ కమిటీ సభ్యులు అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సాయికుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది మార్కండేయులు, గ్రామ కార్యదర్శి అశ్వక్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు చింతకుంట రాజు, మాజీ అధ్యక్షులు పర్వయ్య ప్రధాన కార్యదర్శి మర్రి వెంకటేశం, జిల్లా మత్స్యశాఖ సిబ్బంది శ్వేత, సురేష్, రాజు, రమేష్, సిద్దయ్య, మత్స్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వృత్తి నైపుణ్య పరీక్షలో మత్స్యకారులు

నీటికి పశువుల తొట్టే దిక్కు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నీటి కోసం గ్రామంలోని పశువుల తొట్టే దిక్కవుతోంది. ఈ పాఠశాలల్లో విద్యను అభ్యసించడానికి మండలంలోని యాచారం, బూర్గుల, వజ్జేపల్లి తండా, పూర్య నాయక్ తండా, సజ్జ నాయక్ తండా గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. అయితే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత విద్యార్థులు తమ ప్లేట్లను శుభ్రం చేసుకోవాలంటే పశువుల తొట్టె వద్దకు వెళ్లాల్సి వస్తోంది. పశువులు తాగిన తొట్టిలో దుమ్ము ధూళి చేరి ఆ నీరు అసలే మురికిగా ఉంటాయి. అయితే అవే నీటిని ప్లేట్లు కడిగేందుకు విద్యార్థులు వాడటంతో విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదముంది. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పెరిగిన గ్యాస్ ధరలపై కాంగ్రెస్ నాయకుల నిరసన

నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై అదనంగా రూ.50 పెంచి ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరికాదని, పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కట్టెల పొయ్యి వెలిగించి నిరసన చేపట్టారు.



కట్టెల పొయ్యి వెలిగించి నిరసన తెలుపుతున్న నాయకులు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజలపై పన్నుల భారం మోపుతూ కార్పొరేట్ వ్యాపారులకు అనుకూలంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాషా మొయినుద్దీన్, గంగాశంకర్, అబ్బాగొని గంగాధర్ గౌడ్, హరికాంత్ చారి, విష్ణు, నవీన్, ఎస్టీ సెల్ నాయకులు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంటాకుర్దు క్యాంపు సర్పంచ్ అందరికీ ఆదర్శం

నవతెలంగాణ-బోధన్

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని ఉచితంగా అందించిన పెంటాఖుర్దు సర్పంచ్ శ్రీనివాసరావును శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ భవన నిర్మాణం కోసం 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినా.. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కొంత ఇబ్బందిగా మారిందని, దాంతో సర్పంచ్ అయిన శ్రీనివాసరావు ముందుకు వచ్చి తన సొంత స్థలాన్ని గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం దాతగా అందించడం ఆయన గొప్ప మనసుని నిదర్శనం అని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అమర్నాథ్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, శరత్, ఎంపీపీ బుద్దే సావిత్రి, సీనియర్ నాయకులు బుద్ధి రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జి.నర్సయ్య పాల్గొన్నారు.



స్థలదాత సర్పంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సీతారాంపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ స్వరూప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ విప్ గంప కృషి చేస్తున్నారని, మండలంలోని అన్ని గ్రామాలకు రెండు కోట్ల ఇరవై ఐదు లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. సీతారాంపూర్ గ్రామానికి పది లక్షల రూపాయలు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల అభివృద్ధికై విప్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, సర్పంచ్ దరిపల్లి స్వరూప సంజీవరెడ్డి, ఎంపీటీసీ ఆసాని జ్యోతి మల్లారెడ్డి, చైర్మన్ నాగరాజు కమిటీ డైరెక్టర్ ముదాం గంగయ్య, ఉప సర్పంచ్ యాదయ్య, నాగరాజు, జైపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

విప్ సహకారంతో గ్రామాల అభివృద్ధి

నవతెలంగాణ-భిక్కనూర్

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో పెద్ద ఎత్తున గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ మల్లేష్ మంజుల మల్లారెడ్డి, ఎంపీటీసీ లీలావతి బాలగౌడ్, ఏఎంసీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుర్రి గోపాల్, భిక్కనూర్ మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, సొసైటీ ఉపాధ్యక్షుడు మద్ది స్వామి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అమరావతి సిద్ధిరాంరెడ్డి, రక్షణ కమిటీ చైర్మన్ గౌరీగారి రాజిరెడ్డి, నాయకులు కర్నాల మల్లేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ ముళ్ళపూడి శ్రీదేవి కృష్ణారావు

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దండిగుట్ట సర్పంచ్ ముళ్ళపూడి శ్రీదేవి కృష్ణారావు కోరారు. శుక్రవారం దండిగుట్ట గ్రామపంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దండిగుట్ట గ్రామంలో 589 మంది జనాభా ఉండగా, 18 సంవత్సరాల పైబడిన 385 మందికి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్, డాక్టర్ వినయ్ కుమార్, హెచ్ఈఓ శ్రావణ్ కుమార్, పాలకవర్గ సభ్యులు చరణ్‌సింగ్, మల్లవ్వ, అనూష, గ్రామ కార్యదర్శి గౌతమి, ఆరోగ్య కార్యకర్త విజయ, రాణి, అప్పారావు, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

యూరియాను తగిన మోతాదులో అందించాలి

- వ్యవసాయ అధికారి హరీష్ కుమార్

నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు పంటలకు యూరియాను తాగిన మోతాదులో వాడాలని, ఎక్కువగా వాడితే అగ్గి తెగులు వచ్చే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంటలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ మాట్లాడుతూ.. యూరియా ఎక్కువగా వాడినా గెట్లపై కలుపు మొక్కలు, గడ్డి ఎక్కువగా ఉన్న అగి తెగులు వస్తాయని, వాటిని నివారించుకోవాలని సూచించారు. అగ్గి తెగుళ్ల సోకితే ఐసోప్రోతాలిన్ 400 మిల్లీ లీటర్లు ఎకరాన, ట్రైసైక్లోజోన్ 120 గ్రాములు ఎకరాన, ట్రిప్లోక్సీ స్ట్రోబిన్ 400 మిల్లీమీటర్లు ఎకరాన పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఓ రహదారిలో ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రహదారిపైనే ఉన్నా. ఇటు విద్యుత్ అధికారులు, అటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పెను ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

పశువులకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయాలి

- కౌలాస్ సర్పంచ్ గొల్ల హన్మండ్లు

నవతెలంగాణ-జుక్కల్

పశువులకు నట్టల నివారణ మందు తప్పక వేయాలని కౌలాస్ సర్పంచ్ గొల్ల హన్మండ్లు అన్నారు. శుక్రవారం గ్రామంలో పశువులకు ఉచిత నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పశువైద్యుడు పండరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నట్టల మందును పంపిణీ చేస్తున్న సర్పంచ్

'పది' విద్యార్థులకు నెల రోజులే సమయం

- జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్

నవతెలంగాణ-రెంజల్

పదో తరగతి విద్యార్థులకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తులో మంచి ఫలితాలు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 24,000 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలతో పాటు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, సాటాపూర్ ఉర్దూ మీడియం పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తులో మంచి ఫలితాలు తీసుకురావాలని ఆయన అన్నారు. మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్టోర్ రూము, కిచెన్ రూమ్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యం కలగకుండా చూడాలని ఆయన సూచించారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రత్యేక అధికారిని శ్యామల ఉన్నారు.



పాఠశాలను సందర్శిస్తున్న డీఈవో

మధ్యాహ్న భోజనం పరిశీలన..

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, మండల ప్రత్యేక అధికారి రాములు పరిశీలించారు. గతంలో ఈ పాఠశాలలో పలువురు విద్యార్థినీ విద్యార్థులు అస్వస్థతకు గురికా గా, మండలాన్ని సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు స్వచ్ఛమైన నీటితో, నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని ఆయన ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ఎంపీడీవో శంకర్, మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, ఎంపీఓ గౌసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి..

సాటాపూర్ గ్రామంలోని వికలాంగుల పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ పరిశీలించారు. బోధన పద్ధతులపై ఆయనకు ఉపాధ్యాయుడు విశ్వనాథ్ తెలియజేశారు. హెూమియోతెరపి ద్వారా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి చెవిటి, మూగ విద్యార్థులకు బోధన చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, సర్పంచ్ వికార్ పాషా, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని అన్నసాగర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సర్పంచ్ నాగరాజు లబ్దిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీకి సహకరించి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఎంపీ బీబీ పాటిల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుగు నాగరాజు సంతోష్‌రెడ్డి, వేణు, సంజీవులు, శీను, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్-స్వచ్ఛ సర్వేక్షన్ తరగతులు ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో సిబ్బంది

నవతెలంగాణ-ముప్కాల్

స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ సర్వేక్షణ్‌పై శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలకు, ఫీల్డ్ అసిస్టెంట్, ఐకేపీ సీసీ, వివోఏ, లైన్ డిపార్ట్మెంట్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు సామ పద్మ అధ్యక్షతన శిక్షణా తరగతులు రెండు రోజుల పాటు జరుగుతాయని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. కార్యక్రమంలో శిక్షణా టీమ్ లీడర్ ఎంపీడీవో దామోదర్, సభ్యులు సుభాష్ చంద్రబోస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, అశోక్, జిల్లా కోఆర్డినేటరులు నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఇందులో 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు బోధించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులగా సంధ్య, వ్యాయామ ఉపాధ్యాయుడిగా మహిధర్, తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం ఉపాధ్యాయులుగా శ్రీ హర్షవర్ధన్, శ్రీనిధి, వి.హర్షవర్ధన్, శ్రీ విద్య బోధించారు. అనంతరం ఉపాధ్యాయులుగా బోధించిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన కాంప్లెక్స్ హెచ్.ఎం. మునీరోద్దీన్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు పి.గణేష్, ఈ.గణేష్, లక్ష్మీ ప్రసన్న, అనిత, పాఠశాల చైర్మన్ చిన్న చిన్నయ్య పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ నుండి చెల్లించాలి

- బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధిరాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ ఒకటి నుండి యాజమాన్యం చెల్లించాలని తెలంగాణ బహుజన బీడీ కార్మికుల సంఘం (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు సిద్ధిరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు పెరిగిన కరువు భత్యం(వీడిఏ),9-40పైసలు ఏప్రిల్ 1 నుండి వెయ్యి బీడీలుకు 232-04,పైసలు, చెల్లించాలని బీడీ యాజమాన్యాలకు వినతిపత్రం అందజేశారు. నిజామాబాదు జిల్లా కేంద్రంలో శివాజీ నగర్‌లోగల దితెలంగాణ బీడీ మ్యాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీప్రకాష్, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీకి, వినతిపత్రము అందజేసినట్లు తెలిపారు. అనంతరం సిద్దిరాములు మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు, ప్యాకర్లుకు ఉన్న వేతనంపై రోజుకు 9-40 పైసలు ఇవ్వాలన్నారు. బీడీ చటన్ బట్టి, నెలసరి ఉద్యోగులకు జీతంపై నెలకు రూ.282 చెల్లించాలన్నారు. ఈ పెరిగిన కరువు భత్యం (వీడీఏ) ఏ బీడీ కంపెనీ యాజమాన్యం అయినా కార్మికులకు చెల్లించ కుంటే వారిపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజామాబాదు జిల్లా కోకన్వీనర్ సయ్యద్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, ప్రకాష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్లు, మహిళా సెక్స్ వర్కర్లకు

వ్యాపారాలకోసం లోన్లు అందించేందుకు కృషి చేస్తాం

- అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మారుతినగరలో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ కన్‌స్ట్రక్షన్‌లో స్నేహ టార్గెట్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ. సెక్స్‌వర్కర్లు సమాజంలో వివక్షతకు చిన్న చూపుకు గురవుతున్నారని, వారందరూ తమ వృత్తిని వదిలి జనజీవన శైలిలో కలవాలని కోరారు. రావూరి భరద్వాజ రచించిన పాకుడు రాళ్ళు నవల సెక్స్ వర్కర్లు జీవితానికి అద్దం పట్టిందని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు దౌర్జన్యాలు, వివక్ష, చిన్న చూపు, వారి వృత్తి మానాలనుకున్న మానలేక తిరిగి వారు ఆ వృత్తిలోకి రావడం ఈ నవలలో చక్కగా రాశారన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సెక్స్ వర్కర్లకు హౌసింగ్ లాంటి స్కీములు ఉన్నాయని మన రాష్ట్రంలో కూడా వీరందరికీ ఇండ్లు ఇస్తే మంచిదని అన్నారు. ట్రాన్స్ జెండర్లు, మహిళా సెక్స్ వర్కర్లకు చిన్నచిన్న వ్యాపారాలకు పెట్టుకోవడానికి ఎకనామిక్ రేబులేషన్ స్కీము లోన్లు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు మాట్లాడుతూ.. మహిళా సెక్స్ వర్కర్లు తమకు సోదరిమల లాంటి వారిని, ఎన్నో సందర్భాల్లో వారికి సహాయపడ్డానని నందిపేటలో జరిగిన ఒక సంఘటనలో వారికి అండగా నిలబడి వారికి పునరావాసాన్ని కల్పించడంలో సహకారాలు అందించా మని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి మరో గౌరవ అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్దయ్య, ప్రాజెక్టు మేనేజర్ మహిజ్ అహ్మద్, ప్రిన్సిపల్ జ్యోతి, ఏ ఆర్ టి కౌన్సిలర్ ప్రవీణ్ రెడ్డి, సఖి లీగల్ కౌన్సిలర్ లావణ్య, కెసిఆర్ సేవాద జిల్లా అధ్యక్షుడు రమణారావు, స్నేహ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోమేశ్వర్లు, స్నేహ టిఐ ప్రాజెక్టు సిబ్బంది మహిళా సెక్స్ వర్కర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవి నివారణకు కృషి చేసిన మహిళ సెక్స్ వర్కర్లు, సిబ్బందిని సన్మానించారు. మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారం అందించారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ఇంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సిఓఈ), ధర్మారం (బి) లో 2023-24 విద్యా సంవత్సరానికి టీఎస్‌డబ్ల్యూఆర్‌సిఓఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఈనెల 5 టీఎస్‌డబ్ల్యూఆర్ సీఈఓ సెట్-2023 అనే ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం1 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ బి సంగిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . పరీక్షలో పాల్గొనే విద్యార్థులు ఇంటర్నెట్ కేంద్రాలనుండి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 9. గంటల వరకు హాజరు కావాలని సూచించారు. ఈ పరీక్ష కు మొత్తం 448 మంది విద్యార్థులు హాజరు కాబోతున్నారని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరమునకు గాను టీఎస్ డబ్ల్యూ ఆర్/ టి టి ఆర్ కాలేజ్ లలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు ఈనెల 5న మధ్యాహ్నం. 2.30 గంటల నుండి సాయంత్రం. 5. గంటల వరకు టీజీయూజీ సెట్ పరీక్ష ఉంటుందని వివరించారు. పరీక్షలో పాల్గొనే విద్యార్థులు ఇంటర్నెట్ కేంద్రాలనుండి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రానికి మ. 1.30 గంటల వరకు హాజరు కావాలని పేర్కొన్నారు. హాల్ టికెట్‌లో తప్పులు దొర్లితే సరియైన ఆధారాలు చూపించి పరీక్ష కేంద్రంలో సరిచేసుకోవాలని, ఈ పరీక్షకు మొత్తం 452 మంది విద్యార్థులు హాజరు కాబోతున్నారని, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, ధర్మారం (బి) ప్రిన్సిపాల్ బి. సంగీత తెలిపారు.

గుండె వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సుధాకర్‌రావు మాదాసు సూచన

నవతెలంగాణ-కంఠేశ్వర్

గుండె వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ అండ్ చీఫ్ కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ సుధాకర్ రావు మాదాసు సూచించారు. మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ మొట్టమొదటిసారిగా నిజామాబాద్‌లోని ఓ హోటల్లో పేషెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ రావు మాదాసు మాట్లాడుతూ.. హృద్రోగ ఆరోగ్యం మొత్తం ఆరోగ్యానికి కీలకమైన అంశమని అన్నారు. ఈ పేషెంట్స్ ఫోరమ్ వంటి ఈవెంట్ల ద్వారా రోగులు వారి కుటుంబాలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను విని పరిష్కరిస్తామని తెలిపారు. మల్లా రెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ సిఓఓ మహేంద్ర పాలా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అనేక అనారోగ్యాలకు మరణాలకు గుండె సంబంధిత వ్యాధులు ముఖ్యమైన కారణమని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఇలాంటి కార్యక్రమాలను విస్తరిం చేందుకు స్ఫూర్తిని చ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్నందుకు కృతజ్ఞతగా ఎం.ఆర్.ఎస్.హెచ్ రోగులకు, కుటుంబ సభ్యులకు ప్రివిలేజ్ కార్డను అందించింది. ఇవి ఓపి అండ్ ఐపీ సేవలలో ప్రత్యేక తగ్గింపులను కలిగి ఉంటాయని అన్నారు. మరిన్ని వివరాల కోసం 98490 20296 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. లేదంటే నేరుగా అపాయింట్మెంట్ తీసుకొని సూరారం ఎక్స్ రోడ్స్, జీడిమెట్ల, వెంకటరామ కాలనీ, సూరారం, హైదరాబాద్‌లో కలువవచ్చని అన్నారు. కార్యక్రమంలో సన్రైజ్ కార్డియాలజిస్ట్ వైద్యులు గోపికృష్ణ, సన్రైజ్ హాస్పిటల్ వైద్యులు రాజశేఖర్, ధన్పాల్ వినయ్, నిజామాబాద్ ఇంచార్జ్ రవి, పిఆర్ఓ మధు, ఆసుపత్రి బృందం తదితరులు తోపాటు పేషెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్డులను అందజేస్తున్న దృశ్యం

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ అమరగోని రోజా సదాశివ గౌడ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కంటి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అమరగోని రోజా సదాశివ గౌడ్ కోరారు. శుక్రవారం మండలంలోని రాజరాజేశ్వరి నగర్ గ్రామంలో రెండో విడత కంటి పరీక్షల శిబిరాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోజా సదాశివ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కంటి సమస్యలతో ఎవరు ఇబ్బంది పడకూడదు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వారం రోజులపాటు కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోజా సదాశివ్ గౌడ్ కంటి పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నరసింహస్వామి, కంటి వైద్యులు శివకుమార్, డీఈవో అభినవ్, సూపర్వైజర్ ఎస్తేర్, ఏఎన్ఎంలు అరుణకుమారి, కృష్ణవేణి, అంగన్వాడి టీచర్, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు సదాశివ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కంటి శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ఎస్ఐకి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల ఎస్ఐగా ఇటీవల కొత్తగా వచ్చిన కృష్ణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల యువనేత భగవాన్ తమ్మేవారు శుక్రవారం పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల న్యాయపరంగా సహకరించాలని ఎస్ఐని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూమువార్ రాములు పాల్గొన్నారు.

మా శెట్టి ఆదిత్యను సన్మానించిన ఎంపీ బీబీ పాటిల్

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి గ్రామానికి చెందిన మాశెట్టి ఆదిత్య ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర పొలిటికల్ చైర్మన్‌గా ఎన్నికవడంతో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ హైదరాబాద్‌లో స్వగృహంలో మంగళవారం మా శెట్టి ఆదిత్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల కోసం తన వంతు కృషి చేస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమాజ శ్రేయస్సుకు తన వంతు కృషి చేస్తానన్నారు. వైశ్య ఫెడరేషన్ నాయకులు గంజి రాజమౌళి గుప్తా, ఉప్పల శ్రీనివాస గుప్తా నాపై అపారమైన నమ్మకం ఉంచి పొలిటికల్ చైర్మన్‌గా నియమించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

పాఠశాల ప్రహరీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని అప్పందిఫారం తాండా గ్రామంలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి బాన్సువాడ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో ఎమ్మెల్యే ఫండ్స్ ద్వారా ప్రహరీ గోడ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు. పాఠశాల అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో ప్రహరీ గోడ ఎంతో అవసరం ఉందని అన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ద్వారా అందించే బియ్యం, పప్పు దినుసులు, కూరగాయలను ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన తెలిపారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, సర్పంచ్ రఘు, శ్రీనగర్ రాజు, సీనియర్ నాయకులు మేక వీరాజు, మూడు అంబర్ సింగ్, సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ నామాల సాయిబాబా, ఉపాధ్యాయురాలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో వాటరింగ్ డే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వాటరింగ్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నారాయణ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ప్రతి గ్రామంలో వాటరింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఎంపీఓ ప్రకాష్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీలాలో సీసీ డ్రయినేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలో సర్పంచ్ గౌరాజి లలిత రాఘవేందర్, మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేశ్ సీసీ డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలు మంజూరు కాగా, ఆ నిధులతో గ్రామంలోని ప్రధాన కాలనీలలో పనులను చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామ్ చందర్, సుభాష్, చారి, గఫ్ఫార్, అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

మెట్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో పెద్దగుట్ట లక్ష్మి నర్సింహా స్వామి ఆలయానికి మెట్ల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయ పురోహితులు శివ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం పెద్ద గుట్ట పైన ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు వెళ్లేందుకు సరైన దారి లేదు. దీంతో గ్రామంలోని పలువు దాతల సహకారంతో పెద్దగుట్ట పైకి మెట్లు నిర్మించాలని సంకల్పించారు. పురోహితులు శివ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మెట్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. త్వరలోనే మెట్ల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పనాల గంగారెడ్డి, బుజ్జి మల్లయ్య, మల్లేష్ యాదవ్, కొమ్ముల రవి, దాత్రిక రాజు, తొమ్మిది నరసయ్య, విశ్వనాథ్, డాక్టర్ నరేష్, సంపంగి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని అయ్యప్ప, సాయిబాబా దేవాలయ నిర్మాణ పనులు యాదాద్రి స్థపతి మోతిలాల్ ఆలయ కమిటీ అధ్యక్షులు పోల విఠల్ గుప్తా ఆధర్వంలో మంగళవారం ప్రారంభించారు. ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దళిత సర్పంచ్ భర్తపై దాడి

- దళితులపై కొనసాగుతున్న వివక్ష, దాడులు
- సెటిల్మెంట్లతో బాధితులకు అన్యాయం

నవతెలంగాణ-బోధన్



దళిత సర్పంచ్ భర్తను అగ్రకులవర్గానికి చెందిన వ్యక్తి అకారణంగా దూషిస్తూ దుర్భాషలాడి దాడికి దిగిన ఘటన బోధన్ మండలంలో ఆలస్యంగా వెలుగుజూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండలంలోని ఓ గ్రామంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఓ కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. పనులలో భాగంగా రోడ్డు సమీపంలో మురికి కాలువ ఉండటంతో అందులో పైపులు వేసి రోడ్డు విస్తరించే ప్రయత్నంలో సర్పంచ్ భర్త పనులు పరిశీలిస్తున్నారు. అంతలో అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన వ్యక్తి అకారణంగా సర్పంచ్ భర్తను దూషిస్తూ ఊళ్లో నీ ఇష్టమున్న దగ్గర పనులు చేస్తావా అంటు గల్లాపట్టి దాడికి దిగి షర్టు చింపివేసినట్లు సమాచారం. గతంలోను రెండు సార్లు కూడా సర్పంచ్ భర్తపై ఇదే వ్యక్తి ఇలాగే కులం పేరుతో దూషించి ఇబ్బంది పెట్టినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు తరపు వ్యక్తులు కొంతమంది బాధితుడిని వివాదం పెద్దగా చేయకుండా మానసికంగా ఇబ్బందులు పెట్టి సెటిల్ చేసినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు అక్కడక్కడ వెలుగు చూస్తున్న కొంతమంది రంగప్రవేశం చేసి బాధితులను నయానో, భయానో మెప్పించి పోలీసు స్టేషన్ వరకు వెళ్లకుండా గ్రామాలలోనే సెటిల్మెంట్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరో మండలంలో దళిత సోదరులు తమ భూమిని దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన వ్యక్తి భూమిని దున్ననీయకుండా దుర్భషలాడి, బెదిరించినట్లు తెలిసింది. దళిత ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకుండా పోతున్న ఈ రోజులలో నిరుపేద దళితులపై పలుచోట్ల ఇప్పటికి వివక్ష కొనసాగుతుందని దళితసంఘాల నాయకులు వాపోతున్నారు. ఇలా ప్రతిచోట దళితులపై దాడులు జరుగుతున్నా బాధితులకు న్యాయం జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి నెల చివరి రోజు గ్రామాలలో అంటరానితనంపై, కుల వివక్ష పై సమావేశాలు, సదస్సులు నిర్వహించవలసి ఉన్న ఎక్కడ కూడా నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి. పోలీసు అధికారులు ఇలాంటి ఘటనలపై తక్షణమే విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, కుల వివక్షపై గ్రామాలలో సదస్సులు నిర్వహించాలని దళిత సంఘాలు కోరుతున్నాయి. కుల వివక్ష, దళితులపై దాడులు, బెదిరింపులు చేస్తున్న వారిపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా కేసులు నమోదు చేసి బాధితుల న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సమయపాలనతో రేషన్ సరుకులు అందజేయాలి

- తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న తహసీల్దార్

సమయ పాలన పాటిస్తూ రేషన్ సరుకులు ప్రజలకు అందజేయాలని తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్ సూచించారు. శుక్రవారం పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో మండలం లోని అర్బన్ రూరల్ చౌక ధరల దుకాణం డీలర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో చౌక ధరల దుకాణం స్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతినెల 20న విజిలెన్స్ కమిటీతో రేషన్ షాపు స్థాయిలో మీటింగ్ నిర్వహిచాలని డీలర్లకు తెలిపారు. వచ్చే 3 నెలలకు సంబందించిన గన్ని బ్యాగులను తిరిగి ఎం ఎల్ ఎస్ గోదాంలో తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయ్ కాంత్ రావు, నాయబ్ తహసీల్దార్ (ఎన్ఫోర్స్ మెంట్) వినోద్, మండల గిర్దావర్ అశోక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎంఈవోకు తల్లిదండ్రుల వినతి

నవతెలంగాణ-ఆర్మూర్



వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

ఆలూర్ మండలంలోని గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరితపై చర్యలు తీసుకోవాలి. మండల విద్యాశాఖ అధికారికి తల్లిదండ్రులు మిద్దెల పోసాని, సత్యం శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలూర్ పట్టణంలోని జడ్‌పీహెచ్ఎస్ హైస్కూల్లో హెడ్మాస్టర్ హరిత విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విషయంలో అహంకార అపూర్వకంగా సమాధానాలు ఇస్తుందన్నారు. తమ బాబు ఎం సూర్యతేజని ఈ విద్య సంవత్సరంలో ఏడవ తరగతిలో చేర్పించామన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా అడ్మిషన్ ఇవ్వడంకుండా ఇబ్బందులకు గురి చేస్తుందనప్నారు. గత సంవత్సరం అక్టోబర్ వరకు పాఠశాలకు వెళ్లిన తమ బాబును అర్ధాంతరంగా పాఠశాల నుండి గెంటి వేసిందని తెలిపారు. ఎందుకని అడగడానికి పాఠశాలకు వెళ్తే నిర్లక్ష్య సమాధానమిచ్చి పాఠశాల నుండి గెంటి వేసివందన్నారు. కాళ్లు పట్టుకుంటానని ప్రాధేయపడినా కనికరించడంలేదన్నారు. ఆలూర్ పాఠశాల హెచ్ఎం హరితపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల కార్మికులు.. బడిబాట

నవతెలంగాణ -నవీపేట్

మండల కేంద్రంలో ముగ్గురు బాల కార్మికులను జన విజ్ఞాన వేదిక సభ్యులు రాజశేఖర్ గుర్తించి చైల్డ్ ఆఫీసర్ ఎస్.కె ముజాహిద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం పంపించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సభ్యులు రాజశేఖర్ మండలంలోని ఫకీరాబాద్ గ్రామం నుండి అశోక్, మమత దంపతులు కూలీ పనులు దొరకక పొట్ట చేత పట్టుకొని మండల కేంద్రానికి వచ్చి పిల్లలను పనిలో పెట్టగా జన విజ్ఞాన వేదిక సభ్యులు రాజశేఖర్ గుర్తించి 1098 ఫోన్ చేయగా చైల్డ్ ఆఫీసర్ ముజాహిద్ వచ్చి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ముగ్గురు పిల్లలను బడిబాటకు పంపించారు.

మురికి కాలువ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో మురికి కాలువ నిర్మాణం పనులకు ఎంపీటీసీ సభ్యురాలు తోట జ్యోతి మనోహర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ జ్యోతి మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ. లక్ష 80వేలతో మురికి కాలువ నిర్మాణం పనులను చేపట్టినట్లు తెలిపారు. నిధులు కేటాయించిన ఎంపీటీసీకి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విక్రమ్, వార్డు సభ్యులు ఎర్రవ్వ, నీలిమ, శారదా, పోషన్న, సాగర్, లావణ్య, గణేష్, ఇందిరమ్మ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశ్రారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పేదల అభివృద్ధి కాకుండా పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకే కొమ్ముకాస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పండిత్ వీనిత పవన్, గ్రంధాలయం చేర్మేన్ రాజేశ్వర్, సీనియర్ నాయకులు ప్రేమ్, పోల సుధాకర్ గంగాధర్ మీర శ్రావణ్ యువజన విభాగం అధ్యక్షుడు పృథ్వి యువజన మండల అధ్యక్షులు అగ్గు క్రాంతి, తుడుం రాకేష్, రాజారెడ్డి, కాపల్లి ముత్తన్న ,సొసైటీ చైర్మన్ మైనార్టీ నాయకుడు షేక్ లతీఫ్, మిల్లర్ యూనియన్ అధ్యక్షులు సామ్రాట్ మొహమ్మద్, సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

అందాపూర్ శివారులో వృద్ధుడి హత్య

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఊట్ పల్లి గ్రామానికి చెందిన జడల మదారి(56) అనే వృద్ధుడు గురువారం రాత్రి అందాపూర్ శివారులో హత్యకు గురైనట్లు బోధన రూరల్ ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఊట్ పల్లి గ్రామానికి చెందిన జడల మదారి బెల్లాల్ కల్లుబట్టిలో కూలీగా పనిచేస్తాడు. రోజువారి పనిలో భాగంగా ఆయన కల్లు బట్టిలో పని ముగించుకొని తన టీవీఎస్ మోపెడ్ పై ఇంటికి వెళ్తుండగా అందాపూర్ శివారులో హత్యకు గురైనట్లు తెలిపారు. మృతుడి గొంతుకు తెల్లని టవల్‌తో బలంగా కట్టినట్లు ఉందని దాంతో వృద్ధుడు ఊపిరాడక మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. గొంతుపై గాయాలు ఉండడం, ఎడమ కన్నుపై కొట్టిన గాయాలు ఉండడం, నాలుక కరుచుకుని ఉండడం, ముక్కు నుంచి రక్తం కారడంతో ఆయన హత్యకు గురైనట్టు అనుమానిస్తున్నట్టు తెలిపారు. మృతుని సోదరుని కుమారుడు ఉప్పల రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు

పంటలు సాగుచేసే రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-(వేల్పూరు)ఆర్మూర్

పంటల సాగు చేసే రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంక్సాపూర్ రైతు వేదిక లో భీమ్ గల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఎంఏవో, ఏఈఓలతో పంటల సాగు వివరాల నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంటలు సాగు చేసే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలని, ఏఈవోలు వారి క్లస్టర్ పరిధిలోని పంట నమోదు, రైతులు పంట వేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. చీడపీడల నివారణకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే పురుగు మందులు వాడటం మంచిది అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ వాజిద్ హుస్సేన్, ఏవో సుధామాధురి, భీమ్‌గల్ మల్లయ్య, వేల్పూర్, భీమ్‌గల్, కమ్మర్ పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

డబల్ బెడ్ రూమ్‌ల దరఖాస్తుకు గడువు పొడగింపు

- ఆర్డీఓశ్రీను నాయక్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన వారు డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడగిస్తున్నట్టు ఆర్డీఓ శ్రీను నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలో 300 డబల్ బెడ్ రూమ్ లకు గాను 1389 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అర్హులైన వారు నేడు సైతం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- టీయూ ప్రిన్సిపాల్ ఆరతి
- తెలంగాణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల చదరంగ పోటీలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల చదరంగ పోటీలు, ఎంపికలను శుక్రవారం ఆర్ట్స్, సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించినట్టు యూనివర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ స్పోర్ట్స్, గేమ్స్ డాక్టర్.టి. సంపత్ తెలిపారు.ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్. సీహెచ్. ఆరతి, హజరై మాట్లాడతూ టోర్నమెంట్స్ ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్య మెరుగవుతుందన్నారు. నచ్చిన క్రీడ ప్రతిరోజు ప్రాక్టిస్ చేయాలని కోరారు. స్పోర్ట్స్,గేమ్స్ డైరెక్టర్ డాక్టర్. టి. సంపత్ మాట్లాడుతూ... ఇంటర్ కాళాశాలల టోర్నమెంట్స్ నిర్వహించేందకు అనుమతి ఇచ్చి, ప్రోత్స హిస్తున్నా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి. రవిందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ బి. విద్యావర్ధినిలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ బహుకరించి క్రీడాకారులను అభినందించారు. ఈ టోర్నెమెంట్ లో గెలుపొందిన క్రీడాకారులు సౌత్ జోన్ ఇంటర్ చెస్ మెన్ - 2023, జెఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో ఈ నెల 10 నుండి 12 వరకు జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్, డాక్టర్ నేత, బాలమణి, అనిల్ కుమార్, రమేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

11 మంది మహిళా ఔత్సాహికవేత్తలకు మద్దతు

- 'లెవల్ అప్' ప్రోగ్రాం మద్దతు



హైదరాబాద్ : దేశంలోని ప్రముఖ కోవర్కింగ్ కమ్యూనిటీలలో ఒకటైన 91 స్ప్రింగ్ బోర్డ్, గూగుల్ ఫర్ స్టార్టప్స్ (జీఎఫ్ఎస్) భాగస్వామ్యంలో హైదరాబాద్ నుండి 11 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతును ఇస్తున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. తమ 'లెవల్ అప్' ప్రోగ్రామ్ మొదటి గ్రూప్ కోసం వీరిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నాయి. ఇది దేశవ్యాప్త వర్చువల్ యాక్సిలరేటర్ ప్రోగ్రామని 91 స్ప్రింగ్ బోర్డ్ తెలిపింది. ఇది మహిళా పారిశ్రామికవేత్తలు తమ స్టార్టప్‌లకు నిధులు సమకూర్చు డానికి, వారు తమ వ్యాపారాలను పెంచుకోవడానికి వీలు కల్పిస్తుం దని పేర్కొంది. ఈ మహిళా పారిశ్రామికవేత్తలు ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యావరణం, సాఫ్ట్ వేర్, ఇంటర్నెట్, రవాణా, ఇతర పరిశ్రమల రంగాలలో టెక్ వ్యాపారాలను నడుపుతున్నారని 91 స్ప్రింగ్ బోర్డ్ సీఈఓ ఆనంద్ వేమూరి తెలిపారు.

ప్రయివేటు వినిమయంతో వృద్ధి

- యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ అంచనా

హైదరాబాద్ : ప్రయివేటు వినిమయం, ప్రభుత్వ పెట్టుబడులు పెరగడం ద్వారా రాబోయే ఏళ్లలో భారత ఆర్థికాభివృద్ధి రేటు పెరగనుందని యూనియన్ ఎస్సెట్ మేనేజ్‌మెంట్ ఈక్విటీ కో-హెడ్స్ సంజయ్ బెంబాల్కర్, హార్దిక్ బోరాలు పేర్కొన్నారు. వచ్చే రెండు దశాబ్దాలు ఈ రెండే వృద్ధికి ప్రధాన ఇంధనంగా ఉండనున్నాయన్నారు. 55 శాతం పైగా జీడీపీ ప్రయివేటు వినియోగం ద్వారానే వస్తుందన్నారు. కార్లను సొంతం చేసుకోవడం, విద్యుత్ వినియోగం, ఇంటర్నెట్ వాడకం ద్వారా ప్రయివేటు, ప్రభుత్వ పెట్టుబడులు పెరగనున్నాయన్నారు.

ఫైబ్ ఏడో వార్షికోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలో వినియోగదారులకు రుణాన్ని అందించే అతి పెద్ద యాప్ ఫైబ్ 7వ వార్షికోత్సవంలోకి ప్రవేశించి. వినియోగదారులకు కంపెనీ రూ.10,000 కోట్ల విలువైన 4 మిలియన్ల రుణాలను వితరణ చేసింది. ఈసందర్భంగా ఫైబ్ సహ- వ్యవస్థాపకుడు, సీఈఓ అక్షయ్ మెహ్రోత్రా మాట్లాడుతూ... యువ వర్కింగ్ ప్రొఫెషనల్స్ కు నగదు రుణాలు ఇచ్చే అంశంలో తాము తమ కస్టమర్-ఫస్ట్ ఫిలాసఫీకి కట్టుబడి ఉన్నందుకు ఫైబ్ లో తాము గర్విస్తున్నామన్నారు. వినియోగదారుని డేటాకు మెరుగైన సాంకేతికత, భద్రతను అందించేందుకు తాము చేస్తున్న నిరంతర ప్రయత్నాలు ఈ కొత్త యాప్ లాంచ్ ద్వారా మరింత మెరుగు పరచబడతాయన్నారు. ఈ కొత్త యాప్ విడుదల చేసిన ఫైబ సహ-వ్యవస్థాపకుడు, సీఎఫ్ఎ ఆశిష్ గోయల్ మాట్లాడుతూ... తమ వినియోగదారులకు ఆర్థిక సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకు రావడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

రూ.199 మహిళలకు విటమిన్ డి పరిక్షలు

- అపోలో డయాగ్నోస్టిక్స్ తో జతకట్టిన హార్లిక్స్ ఉమెన్స్ ప్లస్

నవతెలంగాణ-హైదరాబాద్

ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో విటమిన్ డి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు హెచుఎల్ వారి హార్లిక్స్ ఉమెన్స్ ప్లస్ దేశ వ్యాప్తంగా అపోలో డయాగ్నోస్టిక్స్ తో భాగస్వా మ్యాన్ని కుదర్చుకుంది. ఈసందర్భంగా హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ న్యూట్రిషన్ విభాగం ఉపాధ్యక్షుడు కృష్ణన్ సుందరం మాట్లాడుతూ... భారతదేశంలో విటమిన్ డి లోపం చాలా సాధారణమైన విషయం కాగా, ఈ సమస్య గురించి అందరిలో అవగాహన చాలా తక్కువగా ఉందన్నారు. రూ.199లకే మహిళలు విటమిన్ డి లోపాన్ని పరీక్షించుకునేందుకు, వారి ఎముకల ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలనే దానిపై మరింత సమాచారాన్ని పొందేందుకు అనుమతిస్తుందన్నారు.

వేయి ఉద్యోగాల వరకు సృష్టించడమే యూపీఎస్ లక్ష్యం

నవతెలంగాణ-హైదరాబాద్

యూపీఎస్ భారతదేశంలో దాని సాంకేతిక కేంద్రాల నెట్వర్క్ ను విస్తరించడానికి 15-20 మిలియన్ల మధ్య వ్యూహాత్మక పెట్టుబడిని చేస్తోంది. ఈ కేంద్రాలు యూఎస్, యూరోప్ లో ఇన్-హౌస్ సాంకేతిక అభివృద్ధికి బాధ్యత ఉన్న యూపీఎస్ సాంకేతిక బృందాల ఉనికిని పూరిస్తాయి. యూపీఎస్ ఈ కేంద్రాల ద్వారా దేశీయ ఉద్యోగ సృష్టికి కట్టుబడి ఉంది. 2025 చివరికి కనీసం 1,000 ఉద్యోగుల వరకు తీసుకోడాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈసందర్భంగా యూపీ ఎస్ ఈవీపీ, చీఫ్ డిజిటల్, సాంకేతిక అధికారి బాల సుబ్రమణియన్ మాట్లాడుతూ.. యూపీఎస్ భారతదేశానికి కట్టుబడి ఉందన్నారు.

ఇండియా బుక్ఆఫ్ రికార్డ్స్‌కి నెక్సాన్ ఈవీ

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశపు ప్రముఖ ఆటోమొబైల్ తయారీదారు, దేశంలో ఈవీ పరిణామానికి మార్గదర్శకుడైన టాటా మోటార్స్, అత్యంత విశ్వసనీయ, డ్రివెన్ ఈవీ - నెక్సాన్ ఈవీ ఒక ఈవీ వేగవంతమైన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి డ్రైవ్ ను కవర్ చేయడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో విజయవంతంగా ప్రవే శించిందని గర్వంగా ప్రకటించింది. ఈసం దర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహి కల్స్ లిమిటెడ్, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ ఎండీ శైలేష్ చంద్ర మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా గొప్ప ఛార్జింగ్ మౌలిక సదుపాయాల లభ్యతకు ఈ విజయం నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా టాటా పవర్ ఉనికిని మరింత బలోపేతం చేసిందని తెలిపారు. 75కేఎంఎస్ -100కేఎంఎస్ మధ్య క్రమ వ్యవధిలో ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ ఉందని, ఇది భారతదేశ ఈవీ పర్యావరణ వ్యవస్థకు గొప్ప ఫీట్ అన్నారు.

దక్షిణాదిలో విస్తరించిన లుపిన్ డయాగ్నోస్టిక్స్

నవతెలంగాణ-హైదరాబాద్

అంతర్జాతీయంగా ఫార్మా రంగంలో అగ్రగామి సంస్థ లుపిన్ లిమిటెడ్ (లుపిన్) దక్షిణాది విస్తరణలో భాగంగా తమ నూతన ప్రాంతీయ రెఫరెన్స్ లేబరేటరీని హైదరాబాద్ లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ రీజనల్ రెఫరెన్స్ లేబరేటరీ, లుపిన్ డయాగ్నోస్టిక్స్ ప్రస్తుత నెట్వర్క్ దేశవ్యాప్తంగా 380కు పైగా లుపి మిత్రా (లుపిన్ ఫ్రాంఛైజీ కలెక్షన్ కేంద్రాలు), 23 లేబరేటరీలకు జోడించడం జరుగుతుంది. నివారణ ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటుగా అందుబాటు ధరలలో ఉంచడానికి లుపిన్ డయాగ్నోస్టిక్స్ కట్టుబడింది. ఈ లేబరేటరీ ప్రారంభంతో, లుపిన్ డయాగ్నోస్టిక్స్ అత్యధిక నాణ్యత కలిగిన, ఆధారపడతగిన డయాగ్నోస్టిక్ సేవలను హైదరాబాద్ పాటుగా చుట్టుపక్కల నగరాల వినియోగదారులకు అందించనుంది. "దేశవ్యాప్తంగా వ్యక్తులతో పాటుగా కుటుంబాలకు సైతం అందుబాటు. ధరలలో ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలనే మా లక్ష్యాన్ని కొనసాగిస్తుండటం పట్ల సంతోషంగా ఉన్నాము". అని లుపిన్ డయాగ్నోస్టిక్స్ సీఈఓ రవీంద్రకుమార్ అన్నారు.

అమేజాన్ సూపర్ వేల్యూ డేస్‌తో హెూలీ సంబరాలు

నవతెలంగాణ-హైదరాబాద్

తమ పరిపూర్ణమైన హెూలీ పార్టీని నెరవేర్చడానికి అమేజాన్ ఫ్రెష్ పై సూపర్ వేల్యూ డేస్ సమయంలో కస్టమర్స్ తమ షాపింగ్ అవసరాలకు 45% వరకు డిస్కౌంట్ పొందవచ్చు. నిత్యావసరాలు, ఇంకా ఎన్నో వాటి పై ఆఫర్స్ తో కస్టమర్స్ 1 నుండి 7 మార్చి వరకు షాపింగ్ అందుబాటులో ఉంటుంది. తమ మొదటి అమేజాన్ ఫ్రెష్ ఆర్డర్ పై ప్రైమ్ కస్టమర్స్ రూ 250 వరకు, రెగ్యులర్ అమేజాన్ కస్టమర్స్ రూ. 200 వరకు క్యాష్ బ్యాక్ ను పొందవచ్చు. ఐసీఐసీఐ క్రెడిట్ - డెబిట్ కార్డ్ కనీస కొనుగోలుకు రూ 2,500 , డిస్కౌంట్స్ రూ 300 వరకు 4 నుండి 7 మార్చి 2023 వరకు తక్షణ డిస్కౌంట్ పొందవచ్చు.

పారిశ్రామిక వాడలో అందని వైద్యం

ఈఎస్ఐ దవాఖానా జాడేదీ..

- 60 వేల మంది కార్మికులు.. 400 పైగా పరిశ్రమలు
- బొల్లారంలో స్థల సేకరణ.. భవన నిర్మాణం పట్ల అశ్రద్ధ
- డిస్పెన్సరీల్లో వైద్య పరీక్షల్లేవ్..మందుగోలి కరువు
- 100 పడకల ఆస్పత్రి నిర్మించాలని సీఐటీయూ పోరాటాలు

నవతెలంగాణ- మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ మెడికల్ హబ్‌గా మారుతుంది. అత్యాధునిక ఆస్పత్రులు, వైద్య కళాశాలలు విస్తరిస్తున్నాయి.. అయితే, పారిశ్రామిక వాడల్లో కార్మికులకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఇక్కడ వేలాది మంది కార్మికులు, కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. జబ్బు చేస్తే మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేదు. డిస్పెన్సరీల్లో మందుగోలి సైతం దొరకదని ఆవేదన చెందుతున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం, బొంతపల్లి, గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడలుగా విస్తరించాయి. ఈ ప్రాంతంలో సుమారు 400కి పైగా వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, కర్నాటక, తమిళనాడు, ఏపీతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వలసొచ్చిన కార్మికులున్నారు. ఈ ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కార్మికులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందడం లేదు. పరిశ్రమల్లో నిత్యం పొల్యూషన్ మధ్య పనిచేయడం, కుటుంబాలు ఆ ప్రాంతంలోనే నివసించడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. కెమికల్, ఫార్మా, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు తరచూ జరగడంతో కార్మికులు గాయాలపాలవుతున్నారు. సరైన సమయానికి వైద్యమందక జనవరి మాసంలో జరిగిన ప్రమాదాల్లోనే ఆరుగురు కార్మికులు చనిపోయారు. ఇటీవల కాలంలో గడ్డపోతారం, బొల్లారం, బొంతపల్లి, పటాన్‌చెరు, ఖాజీపల్లిలో వివిధ పరిశ్రమల్లో 58 అగ్ని ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో 45 మంది కార్మికులు చనిపోయారు. 161 మంది గాయపడ్డారు. అత్యవసర వైద్యమందకపోవడం వల్ల కొందరు చనిపోయారు. స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు కోరుతున్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని సీఐటీయూ అనేక పోరాటాలు చేసింది.



100 పడకల ఆస్పత్రి అవసరం

పారిశ్రామిక వాడలో 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరి కుటుంబ సభ్యులతో కలిసి లక్షకు పైగా కార్మిక జనాభా ఉంది. కార్మికుల కోసం బొల్లారంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం చేయాలని స్థలం సేకరించారు. మూడేండ్లు కావస్తున్నా ఆస్పత్రి నిర్మించలేదు.

కనీసం పునాది కూడా తవ్వలేదు. స్థానికంగా మెరుగైన వైద్యం అందించేందుకు బొల్లారంలో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సిటీస్కానింగ్, ఎంఆర్ఐ, ఇతర వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, అత్యవసర వైద్యం, 24 గంటలు డాక్టర్లు, సిబ్బంది, అంబులెన్స్, అవసరమైన మందుల సౌకర్యం అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మించాలి



పారిశ్రామిక వాడల్లో ఉన్న కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయాల కోసం బొల్లారంలో అత్యాధునిక సదుపాయాలతో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి. ఆస్పత్రి కోసం గతంలోనే స్థలం సేకరించారు. నిర్మాణం గురించి పట్టించుకోవడంలేదు. ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు అనేకసార్లు లేఖలు రాశాం. విన్నతిపత్రాలిచ్చాం. పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా ఉండటం వల్ల అత్యవసర వైద్యం కోసం దూరం వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు కల్గుతున్నాయి.

- కె.రాజయ్య- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

ఈఎస్ఐ ఆస్పత్రి లేక అవస్థలు



ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యం పాలైతే డిస్పెన్సరీకి వెళ్తే గోలీలిచ్చి పంపుతున్నారు. బాచుపల్లికి వెళ్లి రావాలంటే ఇబ్బందిగా ఉంది. బొల్లారంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించి వైద్యం అందుబాటులోకి తేవాలి.

- కార్మికుడు ఉమేష్- బొల్లారం

మొక్కుబడి డిస్పెన్సరీలు

కార్మికులకు వైద్యం అందించేందుకు ఈఎస్ఐ డిస్పెన్సరీలు పెట్టారు. బొంతపల్లిలో శిథిలావస్థలో ఉన్న అద్దె ఇంట్లో డిస్పెన్సరీ నడుస్తోంది. ఎప్పుడు కూలుద్దో అన్న టెన్షన్‌లో వైద్య సిబ్బంది ఉంటున్నారు. మరో డిస్పెన్సరీ రంగారెడ్డి జిల్లా బాచుపల్లిలో ఉంది. అక్కడికి సంగారెడ్డి జిల్లాలోని బొల్లారం, ఇతర కార్మికులు వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఇబ్బందిగా ఉందంటున్నారు. బాచుపల్లిలో ఉన్న డిస్పెన్సరీని బొల్లారానికి మార్చాలని కార్మికులు, సీఐటీయూ ఎప్పటి నుంచో పోరాడుతున్నాయి. అత్యవసర పరిస్థితిలో సనత్‌నగర్‌లో ఉన్న ఆస్పత్రికి వెళ్లితే ఇన్‌పేషెంట్లకు మాత్రమే వైద్యం అందుతోంది.

ఇంటర్ విద్యార్థుల కోసం టెలీ మానస్

- పరీక్షల పట్ల ఒత్తిడి ఉంటే ఫోన్ చేయండి
- టోల్‌ఫ్రీ నెంబర్ 14416
- 24 గంటలూ అందుబాటులో : నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను నియమించింది. 24 గంటలూ విద్యార్థులకు టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్‌వర్కింగ్ అక్రాస్ ద స్టేట్స్ (టెలీ మానస్)ను ఇంటర్ బోర్డు అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలి కాలంలో ఇంటర్ విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలతోపాటు ఫలితాలు వెల్లడించేంత వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థులెవరైనా పరీక్షల పట్ల భయం, ఒత్తిడి లేదంటే ఇంటర్ విద్యకు సంబంధించిన ఇతర ఏదైనా సమస్యలుంటే సైకాలజిస్టులు, సైకియాట్రిస్ట్‌ల దృష్టికి తీసుకొస్తే కౌన్సిలింగ్ అందిస్తారని తెలిపారు. ఇది ఉచితంగా అందించే సేవలని స్పష్టం చేశారు. టెలీ మానస్ టోల్‌ఫ్రీనెంబర్ 14416కు ఫోన్ చేయాలని కోరారు. టెలీ మానస్ సేవలు కౌన్సిలింగ్, సైకో సోషల్ సపోర్టు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా సైకియాట్రిక్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలను విజయవంతంగా నిర్వహిద్దాం : మంత్రి సబిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షలను విజయవంతంగా నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మంత్రిని హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం (టీఎస్‌జీసీసీఎల్‌ఏ-475) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ కలిశారు. గతనెలలో ప్రారంభమై ఈనెల రెండో తేదీ వరకు ఇంటర్ బోర్డు నిర్వహించిన జనరల్, ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ సంఘం నుంచి మంత్రిని కలిసి ధన్యవాదాలు ప్రకటించారు. ఈనెల 15 నుంచి జరిగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం తరపున అధ్యాపకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు సంబంధించిన అన్ని విషయాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశాలు

- ప్రజాసంఘాల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10,11 తేదీల్లో మండల కేంద్రాల్లో, 14,15 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని ప్రజాసంఘాలు నిర్ణయించాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు ఆశాలత మాట్లాడారు. ఆ సభలు, సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

పగటి కలగానే మిగులుతుంది..

బీజేపీకి కేరళలో చోటు లేదు : సీపీఐ(ఎం), కాంగ్రెస్

- ఇక్కడి ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు : ఐయుఎంఎల్

న్యూఢిల్లీ : మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగం రాజకీయంగా తీవ్ర కలకలం రేపింది. న్యూఢిల్లీలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతూ, కేరళలో బీజేపీ కూటమి అధికారంలోకి రావటం తన కలగా ప్రధాని చెప్పుకొచ్చారు. అయితే కేరళకు సంబంధించి ఆయన కల..కలగానే మిగిలిపోతుం దని సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఐయుఎంఎల్ పార్టీలు స్పందించాయి. ఎన్డీయే అధికార రాష్ట్రాల జాబితాలో కేరళ చేరదని, క్షేత్రస్థాయిలో అలాంటి అవకాశమే లేదని శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆ పార్టీల నాయకులు వ్యాఖ్యానించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఎం.ఎ.బేబి మాట్లాడు తూ, "ప్రధాని మోడీదంతా పగటి కల. కాషాయ పార్టీకి ఒక్క విషయం ఇక్కడ గుర్తుచేయాలి. కేరళలో ఆ పార్టీకి ఉన్న ఒకే ఒక్క స్థానం 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోయింది. ఆ స్థానాన్ని లెఫ్ట్ ఫ్రంట్ కైవసం చేసుకుంది. కేరళలో బీజేపీ పరిస్థితి అత్యంత దయ నీయంగా ఉంది. దీనినిబట్టే ప్రధాని మోడీ కల.. నెరవేరే అవకాశమే కేరళలో లేదు" అని వివరించారు. కేరళ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.డి.సతీశన్ మాట్లాడుతూ, "కేరళలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు. ఎందుకంటే ఫాసిస్టు, ఫ్యూడల్ భావజాలానికి ఇక్కడి ప్రజలు మొదట్నుంచీ వ్యతిరేకం. బీజేపీ రాజకయాలకు ఇక్కడ స్థానమే లేదు. మతతత్వ శక్తులకు కేరళ ప్రజలు చోటివ్వరు. బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్, యుడీఎఫ్ ఎప్పుడూ ముందుంటుంది" అని అన్నారు. కాంగ్రెస్ మిత్ర పక్షం 'ఐయుఎంఎల్' కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. "క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిపై ప్రధాని మోడీకి అవగాహన లేదు. మతతత్వ శక్తులు ఎన్నోమార్లు ఇక్కడ రాజకీయంగా గెలవడానికి ప్రయత్నించాయి. కానీ ఎన్నడూ అది సాధ్యపడలేదు. ఎందుకంటే ఇక్కడి ప్రజలు రాజకీయంగా చైతన్య వంతులు" అని ఐయుఎంఎల్ నాయకుడు ఎం.కె. మునీర్ అన్నారు. త్రిపుర, మేఘా లయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోడీ చేసిన ప్రసంగం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మైనార్టీల మద్దతుతో మూడు రాష్ట్రాల్లో బీజేపీ తన స్థానాన్ని ఎలాగైతే బలపర్చుకుందో, అలాగే కేరళలోనూ జరుగుతుందన్నారు.

అగ్రి ఎక్స్‌పో రైతులకు ఎంతో మేలు

- ప్రారంభోత్సవంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



అగ్రి ఎక్స్‌పో నిర్వహించడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో మూడు రోజులపాటు జరగనున్న అగ్రి ఎక్స్‌పో మంత్రి ప్రారంభించారు. దేశ నలుమూలలకు చెందిన 150కి పైగా ఎగ్జిబిటర్లు, 30 వేల మంది సందర్శకులు హాజరవుతారని తెలిపారు. అగ్రి స్టార్టప్స్ కోసం ప్రత్యేక విభాగమైన స్పార్క్‌బీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్), రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీల క్లస్టర్ జ్ఞాన కేంద్రం, గణనీయ సంఖ్యలో పాల్గొన్న పలు ప్రధాన పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇంత భారీస్థాయిలో అగ్రి ఎక్స్‌పో జరగడం ఇదే మొదటిసారి అన్నారు. వ్యవసాయంలో వివిధ రకాల యంత్రాలు, వినూత్న ఆవిష్కరణలను ఇక్కడ ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఈ ప్రదర్శన వినూత్న ఆవిష్కర్తలకు మాత్రమే కాకుండా రైతులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. కిసాన్ ఫోరమ్ కన్వీనర్ నిరంజన్ దేశ్‌పాండే, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలకు సంబంధించిన పలు వురు అతిథులు హాజరయ్యారు.

ఇంటర్ విద్యార్థుల కోసం 'టెలీ మానస్'

- పరీక్షల పట్ల ఒత్తిడి ఉంటే ఫోన్ చేయండి
- టోల్‌ఫ్రీ నెంబర్ 14416
- 24 గంటలూ అందుబాటులో : నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను నియమించింది. 24 గంటలూ విద్యార్థులకు టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్‌వర్కింగ్ అక్రాస్ ద స్టేట్స్ (టెలీ మానస్)ను ఇంటర్ బోర్డు అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలి కాలంలో ఇంటర్ విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలతోపాటు ఫలితాలు వెల్లడించేంత వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థులెవరైనా పరీక్షల పట్ల భయం, ఒత్తిడి లేదంటే ఇంటర్ విద్యకు సంబంధించిన ఇతర ఏదైనా సమస్యలుంటే సైకాలజిస్టులు, సైకియాట్రిస్ట్‌ల దృష్టికి తీసుకొస్తే కౌన్సిలింగ్ అందిస్తారని తెలిపారు. ఇది ఉచితంగా అందించే సేవలని స్పష్టం చేశారు. టెలీ మానస్ టోల్‌ఫ్రీనెంబర్ 14416కు ఫోన్ చేయాలని కోరారు. టెలీ మానస్ సేవలు కౌన్సిలింగ్, సైకో సోషల్ సపోర్టు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా సైకియాట్రిక్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

అద్దంలా ఆర్ అండ్ బీ రోడ్లు : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్రంలో ఆర్ అండ్ బీ రోడ్లు అద్దంలా తయారవుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఎర్రమంజిల్ లోని ఆర్.అండ్.బీ ప్రధాన కార్యాలయంలో ఆర్ అండ్ బీ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర బోయి, ఈఎన్‌సీ రవీందర్ రావు, ఇతర అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 1170 పీరియాడికల్ రెన్యువల్ రోడ్ల మరమ్మతుల పనుల కోసం రూ . 2875 కోట్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారని చెప్పారు. అందులో సుమారు రూ.570 కోట్లతో 232 పనులు ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 ఏజెన్సీలు పనులు చేపట్టాయని, ప్రతీ ఏజెన్సీ వారానికి కనీసం ఒక పని పూర్తి చేయాలని ఆదేశించారు. కావున పురోగతిలో ఉన్న మిగతా 938 పనులను వారానికి 60 చొప్పున నెలలో 240 పనులు పూర్తి చేసేలా టార్గెట్ పెట్టుకొని పని చేయాలని మంత్రి అధికారులను అదేశించారు. ప్రణాళిక ప్రకారం మూడున్నర నుంచి నాలుగు నెలల్లోపు అంటే జూన్ నాటికి అన్ని పనులు పూర్తి కావాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతీవారం తానే స్వయంగా రోడ్ల వర్క్ ప్రోగ్రెస్ పరిశీలిస్తానని మంత్రి అధికారులతో అన్నారు.

హైదరాబాద్‌లో యూనిస్కాలర్స్ కార్యాలయం

- ప్రారంభించిన టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఎండ్ టూ ఎండ్ సేవలను అందించడానికి వీలుగా హైదరాబాద్‌లో యూనిస్కాలర్స్ కార్యాలయాన్ని ఓపెన్ చేసింది. శుక్రవారం రాజ్‌భవన్ రోడ్డులో ఈ కార్యాలయాన్ని ఐఆర్ఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ సతీశ్‌కుమార్‌తో కలిసి టీఎస్ఆర్టీసీ చైర్మెన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో విద్యనభ్యసించే వారికి మెరుగైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. యూనిస్కాలర్స్ వ్యవస్థాపకులు అమిత్‌సింగ్ మాట్లాడుతూ...ముంబై, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నైలలో తర్వాత హైదరాబాద్‌లో కార్యాలయం ప్రారంభించడం సంతోషకరంగా ఉందని చెప్పారు. విదేశీ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే విద్యార్థుల సంఖ్య హైదరాబాద్‌లో 135 శాతం పెరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. స్టడీలోన్స్, ఆయా విశ్వవిద్యాలయాల్లో కోర్సుల బోధనను పోల్చడం, కెరీర్, కోర్సు మ్యాపింగ్, ఎస్ఓపీ, ప్రాపర్టీ గైడ్‌లైన్స్, తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చేందుకు తమ సంస్థలో వంద మందికిపైగా కౌన్సిలర్లు ఉన్నారని వివరించారు.

2003 డియస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2003 డిసెంబర్ 22కు ముందు నోటిఫికేన్ ఇచ్చి 2004 జనవరి ఒకటి తర్వాత నియామకాలు జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాతపెన్షన్ వర్తింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్రంలోనూ అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో 2003 డియస్సీ నోటిఫికేషన్ 2003 నవంబర్‌లో ఇచ్చారని తెలిపారు. 2004 జులై నాటికి ఫలితాలు వెలువడ్డాయనీ, నియామక ఉత్తర్వులు మాత్రం 2005లో ఇచ్చారని చెప్పారు. అలాంటి ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్రంలో ఆరు వేల మంది, ఇతర శాఖల్లో మరో ఆరు వేల మంది ఉంటారు. వీరందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.